JAYABHERIDAILY.COM
తెలుగు దినపత్రిక

# ప్రభాత జయభేరి

ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
మేడ్చల్ - మల్కాజిగిరి । మంగళవారం 07-10-2025
Medchal - Malkajgiri । Tuesday 07-10-2025
jayabherinews
సంపుటి : 02 । సంచిక : 131 । పేజీలు : 8 । వెల : 5
Vol. 02 । Issue 131 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను

మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...

9391 544 889
call me
jayabheripaper@gmail.com






## సుప్రీంలో బీసీ రిజర్వేషన్
# పిటీషన్ కొట్టివేత

- హైకోర్టుకే వెళ్లండి
- హైకోర్టు స్టే ఇవ్వకపోతే, అంటే మీరు ఇక్కడికి వచ్చేస్తారా?

**జయభేరి, న్యూఢిల్లీ, అక్టోబరు 6 :**

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు 42 శాతం రిజర్వేషన్ల కోటా కేటాయింపును సవాలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం తిరస్కరించింది. హైకోర్టులో ఈ కేసు ఇప్పటికే విచారణలో ఉండగా, ఎందుకు సుప్రీంకు వచ్చారని జస్టిస్ విక్రమ్ నాథ్ పిటిషనర్లను ప్రశ్నించారు. పిటిషనర్‌కు హైకోర్టును సంప్రదించాలని సూచించింది. వాంగ గోపాల్ రెడ్డి దాఖలు చేసిన రిట్ పిటిషన్ నంబర్ 945/2025లో తెలంగాణ ప్రభుత్వం G.O. నంబర్ 9 ద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం కోటా కేటాయింపును ప్రశ్నించారు. ఇది రాజ్యాంగం 32వ విభాగం కింద దాఖలైనది. పిటిషనర్ న్యాయవాది, హైకోర్టు అక్టోబర్ 8న విచారణ నిర్వహించనుందని, స్టే ఆర్డర్ లేకపోవడంతో సుప్రీంకు వచ్చామని వాదించారు. అయితే సు జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా బెంచ్ ఈ వాదనను అంగీకరించలేదు. "హైకోర్టు స్టే ఇవ్వకపోతే, అంటే మీరు ఇక్కడికి వచ్చేస్తారా?" అని ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. "పిటిషనర్‌కు ఆర్టికల్ 32 పిటిషన్‌ను విత్‌డ్రా చేసుకోవడానికి అనుమతి ఇస్తున్నాం. అవసరమైన రిలీఫ్‌ల కోసం సంబంధిత హైకోర్టును సంప్రదించవచ్చు" అని ఆర్డర్ జారీ చేసింది.

## సీజేఐ గవాయ్‌పై షూ తీసి దాడి

- సుప్రీంకోర్టులో లాయర్ హల్‌చల్

**న్యూఢిల్లీ, అక్టోబరు 6 :**

దేశ సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో సోమవారం నాడు నాటకీయ పరిణామం చోటుచేసుకుంది. సీజేఐ బి.ఆర్. గవాయి ఎదుట ఒక లాయర్ హల్ చల్ చేశాడు. ఆ లాయర్ ఏకంగా సిజెఐ బీఆర్ గవాయ్ ఎదుట షూ తీసి దాడి చేయాలని ప్రయత్నించడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. భద్రతా సిబ్బంది ఆ లాయర్‌ను బయటకు పంపడానికి ప్రయత్నించగా, బయటకు వెళ్తూ 'సనాతన్ కా అపమాన్ నహీ సహేగా హిందుస్థాన్' (సనాతన ధర్మాన్ని అవమానించడాన్ని హిందుస్థాన్ సహించదు) అనే నినాదం కూడా ఇచ్చారు. ఈ సంఘటన సుప్రీంకోర్టులో ఉదయం 11 గంటల

...మిగతాది 2 లో

## నవంబర్ 11న జూబ్లీహిల్స్ ఉపఎన్నిక




- ఉప ఎన్నిక బీఆర్ఎస్ అభ్యర్థిగా మాగంటి సునీత
- అభ్యర్థిపై కాంగ్రెస్ కసరత్తు
- బీజేపీ అభ్యర్థి కోసం వేట

**జయభేరి, హైదరాబాద్, అక్టోబరు 6:**

హైదరాబాద్‌లో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక అభ్యర్థిగా మాగంటి సునీతను ప్రకటించి బీఆర్ఎస్ ముందు వరుసలో ఉంది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఇంకా అభ్యర్థుల వేటలోనే మునిగిపోయాయి. అయితే ప్రచారంలో మాత్రం మూడు పార్టీలు దూసుకుపోతున్నాయి. బీహార్ ఎన్నికల తేదీని ప్రకటించిన ఈసీ.. జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికకు పోలింగ్ తేదీని కూడా ప్రకటించింది. నవంబర్ 11 జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక జరగనుంది. దీంతో 14వ తేదీన కౌంటింగ్ ఉంటుందని ఈసీ తెలిపింది.

**అభ్యర్థిపై కాంగ్రెస్ కసరత్తు**

జూబ్లీహిల్స్ అభ్యర్థిపై కాంగ్రెస్ కసరత్తు చివరి అంకానికి చేరింది. సర్వే ఆధారంగా ముగ్గురు అభ్యర్థులను షార్ట్ లిస్ట్ చేశారు ఇంచార్జ్ మంత్రులు. ఢిల్లీలో సోమవారం జరగున్న స్క్రీనింగ్ కమిటీకి డిటెయిల్స్ పంపనుంది పీసీసీ. రాష్ట్ర నాయకత్వం నవీన్ యాదవ్, బొంతు రాంమోహన్, సీఎన్ రెడ్డి పేర్లు ఫైనల్ చేసినట్టు ప్రచారం జరుగుతోంది. మరోవైపు తాను కూడా టికెట్ రేసులో ఉన్నానంటున్నారు అంజన్ కుమార్ యాదవ్. మరోవైపు జూబ్లీహిల్స్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్‌లు, కోఆర్డినేటర్లతో మీనాక్షి నటరాజన్, మహేష్ కుమార్ గౌడ్ సమావేశమయ్యారు. ఎవరికి టికెట్ ఇస్తే పార్టీకి మేలు జరుగుతుందన్న అంశంపై ఆరా తీశారు. సోమవారం అభ్యర్థిని ప్రకటించే అవకాశం ఉన్నట్టు సమాచారం.

**బీజేపీ అభ్యర్థి కోసం వేట..**

బీజేపీ కూడా ఇప్పటికే అభ్యర్థి ఎంపిక కోసం త్రీమెన్ కమిటీ వేసింది. ఈ కమిటీ జూబ్లీహిల్స్ నేతల అభిప్రాయాలను సేకరించింది. టికెట్ రేసులో లంకల దీపక్ రెడ్డి పేరు బలంగా వినిపిస్తోంది. కీర్తి రెడ్డి, ఆకుల విజయ, వీరపనేని పద్మ కూడా టికెట్ ఆశిస్తున్నారు. వీలైనంత త్వరగా అభ్యర్థిని ప్రకటించేందుకు కసరత్తు చేస్తున్నామన్నారు బీజేపీ నేతలు. జూబ్లీ హిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో ఈ ఉప ఎన్నిక ఏర్పడింది. ఇప్పటికే అభ్యర్థిని ప్రకటించిన బీఆర్ఎస్.. కారు గుర్తుపై మాగంటి గోపీనాథ్ భార్య సునీత బరిలోకి దిగనున్నారు. కాంగ్రెస్ నుంచి ముగ్గురు ప్రాబబుల్స్ నవీన్ యాదవ్, బొంతు రామ్మోహన్, సీఎన్ రెడ్డిలు ఉండగా, బీజేపీ నుంచి నగులుగురు ఆశావహులు దీపక్ రెడ్డి, కీర్తిరెడ్డి, ఆకుల విజయ, వీరపనేని పద్మ ఉన్నట్లు తెలుస్తోంది.

...మిగతాది 2 లో

## బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు
# మోగిన నగారా




- కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల
- రెండు విడతల్లో ఎన్నికలు.. నవంబర్ 6న తొలి విడత, నవంబర్ 11న రెండో విడత పోలింగ్
- నవంబర్ 14న ఓట్ల లెక్కింపు.. ఫలితాలు వెల్లడి

**జయభేరి, న్యూ ఢిల్లీ, అక్టోబర్ 6 :**

బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు నగారా మోగింది కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం షెడ్యూల్ విడుదల చేసింది. రెండు విడతల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు ప్రకటించింది. బీహార్ అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ గురించి ఇవాళ ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ఎన్నికల సంఘం మీడియా సమావేశాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ బీహార్ ఎన్నికల తేదీలను ప్రకటించారు. నవంబర్ 6న తొలి విడత, నవంబర్ 11న రెండో విడత పోలింగ్ జరుగుతుందని సీఈసీ వెల్లడించారు. నవంబర్ 14న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడించనున్నారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు తర్వాతే వీవీ ప్యాట్, ఈవీఎంల లెక్కింపు చేపట్టనున్నారు. బీహార్ ఎన్నికల షెడ్యూల్‌తోపాటూ దేశంలోని పలు రాష్ట్రాల్లో ఖాళీ ఏర్పడిన అసెంబ్లీ స్థానాల ఉపఎన్నికకు సంబంధించిన షెడ్యూల్‌ను కూడా ప్రకటించారు. 243 స్థానాలు కలిగిన బీహార్ అసెంబ్లీకి నవంబర్ 22తో గడువు ముగియనుంది. ఈలోగా కొత్త ప్రభుత్వం కొలువుదీరాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలోనే ఎన్నికల ఏర్పాట్లను సమీక్షించిన ఈసీ.. గడువులోగా ఎన్నికలు పూర్తిచేస్తామని ఇప్పటికే ప్రకటించింది. కాగా, 2020లో జరిగిన ఎన్నికల్లో మూడు

...మిగతాది 2 లో


## పీఓకేలో తిరుగుబాటు భారత్ కి ఆయుధమా..

...మిగతాది 2 లో



## మొయినాబాద్ ఫాంహౌస్‌లో మైనర్ల రేవ్ పార్టీ

- మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చెర్రీ వోక్స్ ఫార్మ్ హౌస్ లో రాజేంద్రనగర్ ఎస్ఓటి పోలీసుల దాడులు
- ఈ పార్టీలో 50 మందికి పైగా మైనర్ విద్యార్థులు పాల్గొన్నట్టుగా సమాచారం
- ఈ డ్రగ్స్ పార్టీలో 14 మంది పైగా యువతిలు 35 మంది పైగా యువకులు
- దాంట్లో డ్రగ్స్ పాజిటివ్గా ఇద్దరికీ నిర్ధారణ
- ఫామ్ హౌస్ లో ఎలాంటి పర్మిషన్స్ లేకుండా 8 బాటిల్లు మద్యాన్ని, డీజే ను సీజ్ చేసిన పోలీసులు
- పార్టీ నిర్వాహకులు కిషన్ తో పాటు మరొక ఐదు మందిపై కేసు నమోదు
- ఇంస్టాగ్రామ్ లో ట్రాప్ హౌస్ పేరుతో ఐడి క్రియేట్ చేసి నిర్వాహనికి ఆన్లైన్ ద్వారా ఒక విద్యార్థి 1600 డబ్బులు చెల్లించి పార్టీలో చేరవచ్చని నిర్వాహకుడు చెప్పాడు



2 లో



# కల్తీ మద్యం కేసు

- ఆరోపణలు ఎదుర్కొంటున్న టీడీపీ నేతలపై వేటు
- దాసరిపల్లి జయచంద్రా రెడ్డి, కట్టా సురేంద్ర నాయుడులను తెలుగుదేశం పార్టీ నుంచి సస్పెండ్
- కల్తీ మద్యం తయారుచేస్తున్న ఈ కుటీర పరిశ్రమను సీజ్
- రూ. కోటికి పైగా విలువైన నకిలీ మద్యం పోలీసులు స్వాధీనం

**జయభేరి, విజయవాడ, అక్టోబరు 6 :**

కల్తీ మద్యం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న టీడీపీ నేతలపై పార్టీ అధినేత చంద్రబాబు చర్యలు చేపట్టారు. దాసరిపల్లి జయచంద్రా రెడ్డి, కట్టా సురేంద్ర నాయుడులను తెలుగుదేశం పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. టీడీపీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు సస్పెన్షన్ వేటు వేశారు. వారిపై విచారణ చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. గత సార్వత్రిక ఎన్నికల్లో తంబళ్లపల్లి నియోజకవర్గం నుంచి పోటీ చేసిన టిడిపి నేత జయచంద్రారెడ్డి ఓటమి చెందారు. ఎన్నికల్లో ఓటమి తర్వాత జయచంద్రారెడ్డి వ్యవహారం పార్టీకి తలనొప్పిగా మారింది.

...మిగతాది 2 లో

## అర్థం కానీ కవిత వ్యూహం

భారత రాష్ట్ర సమితి నుంచి సస్పెండ్ చేయడంతో కవిత పూర్తి స్థాయి జాగృతి నేతగా మారిపోయారు. ఎమ్మెల్సీ పదవికి చేసిన రాజీనామాను ఆమోదించినా ఆమోదించకపోయినా ఆ పదవి లేనట్లుగానే వ్యవహరిస్తున్నారు.

...మిగతాది 2 లో



▶▶ మొదటిపేజీ తరువాయి

## సీజేఐ గవాయ్‌పై షూ తీసి దాడి

ప్రాంతంలో జరిగింది. ఈ ఘటన తర్వాత సీజేఐ బీఆర్ గవాయ్ కోర్టులో ఉన్న న్యాయవాదులను వాదనలు కొనసాగించాలని కోరారు. ఇలాంటి విషయాలతో తాను ఏమాత్రం ప్రభావితం కానని స్పష్టం చేశారు. ఖజురహోలో ఏడు అడుగుల ఎత్తైన విష్ణు విగ్రహాన్ని తిరిగి ప్రతిష్టించడంపై ఇటీవల విచారణ జరిగింది. ఈ సందర్భంగా CJI బీఆర్ గవాయ్ ఇటీవల ఒక కామెంట్ చేయగా.. దీనిపై తీవ్రమైన వ్యతిరేకత వచ్చింది. పిటిషన్‌ను తోసిపుచ్చుతూ CJI, "వెళ్లి దేవుడిని ఏదైనా చేయాలని అడగండి. అది పురావస్తు ప్రదేశం కనుక ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా అనుమతి ఇవ్వాలి" అని అన్నారు. ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో కలకలం రేపాయి. చాలా మంది నెటిజన్లు, హిందువులు సీజేఐ గవాయ్ మతపరమైన మనోభావాలను దెబ్బతీశారని ఆరోపించారు. రెండు రోజుల తర్వాత కోర్టులో ఈ వివాదంపై మాట్లాడుతూ, ప్రధాన న్యాయమూర్తి గవాయ్ తనకు ఎవరినీ అగౌరవపరిచే ఉద్దేశ్యం లేదని వాదించారు. తాను అన్ని మతాలను గౌరవిస్తానని...ఇది సోషల్ మీడియాలో చర్చకు దారితీసిందని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం తరపున వాదించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సీజేఐ బీఆర్ గవాయ్‌కి మద్దతు తెలిపారు. ఏదైనా సంఘన జరిగితే అందుకు ప్రతిస్పందనలు తరచుగా సోషల్ మీడియాలో భిన్నంగా ఉంటాయని అన్నారు. న్యూటన్ లా ప్రకారం ప్రతి చర్యకు సమానమైన ప్రతిచర్య ఉంటుంది, కానీ ఇప్పుడు ప్రతి చర్యకు సోషల్ మీడియాలో సరికాని ప్రతిచర్య వస్తోంది సర్ అని సొలిసిటర్ జనరల్ అన్నారు. ఈ సంఘటనకు కారణమైన న్యాయవాది కోర్టులో జరిగిన పరిణామంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. తీవ్ర ఆవేశంతో లాయర్ ఈ చర్యకు పాల్పడి ఉంటారని భావిస్తా అన్నారు.

## బీసీ రిజర్వేషన్ పిటీషన్ కొట్టివేత

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం కోటా కేటాయింపు వివాదాస్పదంగా మారింది. గతంలో 29 శాతం ఉండగా, కాంగ్రెస్ ప్రభుత్వం G.O. 9 ద్వారా దీన్ని పెంచింది. ఈ మేరకు బీసీ నాయకులు స్వాగతించగా, కొందరు ఇది రాజ్యాంగానికి విరుద్ధమని సవాలు చేశారు. హైకోర్టులో ఈ కేసు ఇప్పటికే పెండింగ్‌లో ఉంది. ఈ నిర్ణయంతో బీసీ కోటా విషయంలో హైకోర్టు అక్టోబర్ 8న విచారణకు మార్గం సుగమం అయింది. ఎన్నికలు ఆలస్యం కాకుండా చూడాలని ప్రభుత్వం ఆశిస్తోంది. బీసీ సంఘాలు ఈ తీర్పును స్వాగతించాయి. విచారణ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొన్నం సహా చాలా పలువురు కాంగ్రెస్ నేతలు, ప్రభుత్వ పెద్దలు ఢిల్లీలో సుప్రీంకోర్టు విచారణకు హాజరయ్యారు. తెలంగాణలో బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేయడంపై రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందిస్తూ, బీసీ రిజర్వేషన్ల విషయంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందని స్పష్టం చేశారు. ఈ అంశంపై అసెంబ్లీలో చట్టబద్ధంగా ఆమోదించుకుని ముందుకు వెళుతున్నామని ఆయన తెలిపారు. బీజేపీ అన్ని రిజర్వేషన్లకు వ్యతిరేకమని ఆయన ఆరోపించారు. బీసీ రిజర్వేషన్లపై చట్ట సవరణ బిల్లు, ఆర్డినెన్స్‌ను అడ్డుకుంటున్నది బీజేపీ నేతలేనని ఆయన మండిపడ్డారు. రిజర్వేషన్ల బిల్లును అసెంబ్లీలో ఆమోదించి, ఇప్పుడు ఆ పార్టీ నేతలు మాట మారుస్తున్నారని విమర్శించారు. తెలంగాణ బీజేపీ నేతలకు చిత్తశుద్ధి ఉంటే కేంద్రంపై ఒత్తిడి తెచ్చి బిల్లులను ఆమోదింప చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ ఒక ఫ్యూడలిస్టు పార్టీ అని, ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకమని విమర్శించారు. బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు గతంలో హెచ్‌సీయూలో ఎస్సీలకు వ్యతిరేకంగా పోరాటాలు చేశారని ఆయన గుర్తు చేశారు. అసెంబ్లీలో రిజర్వేషన్ బిల్లుకు మద్దతు ఇచ్చిన బీజేపీ, బీఆర్ఎస్ ఇప్పుడు న్యాయ ప్రక్రియలోనూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## కల్తీ మద్యం కేసు

అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గం మొలకలచెరువులో కల్తీ మద్యం తయారు చేస్తున్నారని సమాచారం అందింది. ఎక్సైజ్ అధికారులు, స్థానిక పోలీసులు కల్తీ మద్యం తయారుచేస్తున్న ఈ కుటీర పరిశ్రమను సీజ్ చేశారు. అక్కడ జరిగిన తనిఖీల్లో రూ. కోటికి పైగా విలువైన నకిలీ మద్యం, తయారీకి ఉపయోగపడే యంత్రాలు, సరుకులు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో భాగంగా 9 మందిని పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. టీడీపీ నేతలు స్థానికంగా రా మెటీరియల్‌ను సేకరించుకుని, ఆధునిక యంత్రాలతో కల్తీ మద్యాన్ని తయారు చేస్తున్నారు. ఆ మద్యాన్ని కదిరి, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లోని పలు ప్రాంతాలకు దర్జాగా సరఫరా చేస్తున్నారు. కల్తీ మద్యం సేవించడంతో స్థానికుల్లో ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని పోలీసులు చెబుతున్నారు. పోలీసులు గుర్తించి సీజ్ చేసిన ఈ డంప్‌లో 500 లీటర్లకు పైగా కల్తీ మద్యం, మిక్సింగ్ మెషీన్లు, బాటిలింగ్ యూనిట్లు, కెమికల్స్ వంటి ముడి సరుకును సీజ్ చేశారు. ఎక్సైజ్ ఇంటెలిజెన్స్ సమాచారం ఆధారంగా శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో మొలకలచెరువు ఔటర్ రింగ్ రోడ్ వద్ద ఒక గోదాములో ఈ డంప్‌ను గుర్తించారు. అక్కడ 9 మంది కల్తీ మద్యాన్ని బాటిల్స్‌లో ప్యాక్ చేస్తూ, ట్రాన్స్‌పోర్ట్ చేస్తూ ఉన్నారని గమనించిన ఎక్సైజ్, పోలీసు టీమ్ దాడి చేసింది. నిందితులు పారిపోవడానికి ప్రయత్నించినా, స్థానిక పోలీసులతో కలిసి ఎక్సైజ్ టీం అందరినీ అరెస్ట్ చేసింది. మొత్తం 15 ఎక్సైజ్ సిబ్బంది, 10 మంది ఈ దాడిలో పాల్గొన్నారు. అరెస్టైన వారిపై ఎక్సైజ్ యాక్ట్‌లో సెక్షన్లు (8(1)(a), 34(ఎ)) ప్రకారం కేసులు నమోదు చేశారు. వారిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

## బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు మోగిన నగారా

విడతల్లో పోలింగ్ జరుగగా.. అంతకుముందు ఐదు విడతల్లో పోలింగ్ నిర్వహించారు. బీహార్‌లో 7.42 కోట్ల మంది ఓటర్లు ఉన్నట్లు ఈసీ వెల్లడించింది. సెప్టెంబర్ 30న ఓటర్ల జాబితాను ప్రచురించింది. కాగా, ఎన్నికల ప్రక్రియలో నిష్పాక్షికత, పారదర్శకత కోసం తీసుకొచ్చిన 17 సంస్కరణలను బీహార్ ఎన్నికల నుంచే అమలు చేయనుంది. వీటిలో పోలింగ్ సందర్భంగా కొన్ని, ఓట్ల లెక్కింపు సమయంలో కొన్ని అమలవుతాయి. ఇకపై ఏ పోలింగ్ కేంద్రంలోనూ 1,200 మందికి మించి ఓటర్లు ఉండరు. ప్రస్తుతం 1,500 మంది ఓటర్లు ఉంటున్నారు. తాజా సవరణతో బీహార్‌లో ప్రస్తుతమున్న 77,895 పోలింగ్ కేంద్రాలు 90,712కి పెరుగనున్నాయి. ఈవీఎంలపై తొలిసారి కలర్ ఫోటోలను ప్రచురించనున్నారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఈ విధానాన్ని ప్రవేశ పెడుతున్నట్లు సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులకు చెందిన కలర్ ఫోటోలు, పేర్లు ఈవీఎం మెషీన్లపై ఉంటాయి. ఎలాంటి ఫిర్యాదులకైనా 1950 నెంబర్‌కు ఓటర్లు డయల్ చేయొచ్చని సీఈసీ తెలిపారు.

## మైనర్ల రేవ్ పార్టీ

మైనర్లు కలిసి మత్తు పార్టీ చేసుకోవడం హైదరాబాద్‌లో సంచలనంగా మారింది. ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన మైనర్లు ఒక గ్రూపుగా ఏర్పడి ఏకంగా ఓ ఫామ్‌హౌస్‌లో మత్తు పార్టీకి హాజరుకావడం కలకలం రేపుతోంది. రాజేంద్రనగర్ ఎస్వోటీ పోలీసులు తనిఖీలు చేసి మత్తు పార్టీ గుట్టు రట్టు చేశారు. ఒంటరిగా వస్తే ఒక రేటు, జంటగా వస్తే మరో రేటుతో పాస్‌లు ఇచ్చి మరీ మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చెర్రీ వోక్స్ ఫార్మ్ హౌస్ లో పార్టీ నిర్వహించారని పోలీసులు గుర్తించారు. నగరానికి చెందిన ఓ డీజే 'ట్రాప్ హౌస్.9ఎంఎం' పేరుతో ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ క్రియేట్ చేశాడు. ఈ ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌తో యాక్టివ్‌గా ఉండే మైనర్ల టార్గెట్ చేశాడు. ఆ డీజే మొయినాబాద్‌లోని ఓ ఫామ్‌హౌస్‌లో ట్రాప్ హౌస్ పేరుతో పార్టీ నిర్వహిస్తున్నట్లు ప్రచారం చేశాడు. ఇది సాధారణ పార్టీ కాదని, ఇందులో హద్దులు లేని ఎంజాయ్‌మెంట్ సరదా ఉంటుందని మైనర్లను ఆకర్షించాడు. ఈ పార్టీకి పాస్‌లు తప్పనిసరి అనే కండీషన్ పెట్టాడు. పార్టీకి ఒక్కరు హాజరుకావాలంటే రూ.1,600 పాస్, జంటగా వస్తే రూ.2,800గా పాస్ ధర నిర్ణయించాడు. ఇన్‌స్టాలో ఈ ప్రకటనను చూసిన మైనర్లు పార్టీకి ఉత్సాహంగా సిద్ధమయ్యారు. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన దాదాపు 50 మంది మైనర్లు శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మొయినాబాద్‌లోని ఓక్స్ ఫామ్‌హౌస్‌లో ట్రాప్ హౌస్ పార్టీని ఆ డీజే ఏర్పాటు చేశాడు. వారంతా మైనర్లే.. హద్దులు లేని ఎంజాయ్ మెంట్ పార్టీకి హాజరయ్యారు. పార్టీ జోరుగా సాగుతుండగా, రాజేంద్రనగర్ ఎస్వోటీ పోలీసులు అకస్మాత్తుగా మొయినాబాద్ చెర్రీ వోక్స్ ఫాంహౌస్‌పై దాడి చేశారు. పార్టీలో పాల్గొన్న వారికి డ్రగ్ టెస్టులు నిర్వహించగా, ఇద్దరు మైనర్లు గంజాయి తీసుకున్నట్లు తేలింది. పోలీసులు ఆరుగురు నిర్వాహకులను అదుపులోకి తీసుకుని, 6 విదేశీ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వారిని మొయినాబాద్ పోలీసులకు అప్పగించారు. పార్టీ నిర్వాహకులు కిషన్ తో పాటు మరొక ఐదు మందిపై కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టారు. పార్టీలో పాల్గొన్న మైనర్ల విషయాన్ని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పిల్లలు ఏం చేస్తున్నారు, ఎక్కడికి వెళ్తున్నారు.. వారి అలవాట్లు ఎలా మారుతున్నాయో చూసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపైనే ఉందన్నారు. డ్రగ్స్ కేసుల్లో దొరికితే వారి జీవితాలు నాశనం అవుతాయని.. ఇప్పటికైనా పిల్లలను సరైన దారిలో పెట్టుకోవాలని తల్లిదండ్రులకు పోలీసులు సూచించారు.

# పీఓకేలో తిరుగుబాటు భారత్ కి ఆయుధమా..

**పాక్ ఆక్రమిత కశ్మర్ లో ఇప్పుడు ప్రజా తిరుగుబాటు జరుగుతోంది. ప్రజలంతా పాక్ ప్రభుత్వంపై తిరుగబడుతున్నారు. అన్నీ స్తంభించిపోయాయి. ప్రజల్ని కట్టడి చేయడానికి పాకిస్తాన్ పెద్ద ఎత్తున సైన్యాన్ని పంపింది. వారు ఆందోళనలపై కాల్పులు జరిపి కొంత మంది చనిపోవడానికి కారణం అయ్యారు. ఇది అగ్నికి ఆజ్యం పోసినట్లయింది. ఇప్పుడు పీవోకేలో పరిస్థితి నివురుగప్పిన నిప్పులా ఉంది.**



తిరుగుబాటుదారులు పాకిస్తాన్ ప్రభుత్వం వద్ద 30కిపైగా డిమాండ్లు పెట్టారు. షాబాజ్ షరీఫ్ ప్రభుత్వం చర్చలకు కమిటీని నియమించిది. ఆ డిమాండ్లను తీర్చేంత శక్తి పాక్ ప్రభుత్వం వద్ద లేదు. ఏదో విధంగా టైంపాస్ చేయాలని.. ఘర్షణలు చెలరేగకుండా.. తిరుగుబాటును ఆపేయాలని అనుకుంటోంది. అక్కడ జరుగుతున్న మానవహక్కుల ఉల్లంఘనపై భారత్ స్పందించింది. వాటికి పాకిస్తాన్ ను బాధ్యత వహించేలా చేయాలని అంతర్జాతీయ సమాజాన్ని కోరుతోంది. ఇటీవల ఆఫ్ఘన్ శివార్లలో సొంత దేశ ప్రజలపై సైన్యంతో మిస్సైళ్ల దాడి చేయించింది పాకిస్తాన్. ముప్పై మందికిపైగా చనిపోయారు. వారంతా టెర్రరిస్టులని పాక్ చెప్పుకుంది. ఓ వైపు బలూచిస్తాన్, మరో ఆఫ్ఘన్ సరిహద్దు ప్రాంతాలు, మరో వైపు పీవోకే ఇలా.. అన్ని వైపుల నుంచి పాకిస్తాన్ సమస్యలను ఎదుర్కొంటోంది. ఇలాంటి సమయంలో భారత్ పాకిస్తాన్ కు హెచ్చరికలు జారీ చేస్తోంది. ఆ దేశం మళ్లీ ఉగ్రవాద కార్యకలాపాలను పెంచుతోందని .. ఈ సారి కుట్రలు చేస్తే ప్రపంచ పటంలో లేకుండా చేస్తామని హెచ్చరికలు జారీ చేస్తోంది. పహల్గాం దాడితో ఉగ్రవాదులపై ప్రతీకార చర్యగా చేపట్టిన ఆపరేషన్ సింధూర్ తర్వాత, పాక్ ఆక్రమిత కాశ్మీర్ గురించి చర్చ జరుగుతోంది. కాశ్మీర్‌లోని ఒక భాగాన్ని పాకిస్తాన్ ఆక్రమించుకుంది. భారతదేశంలో పీవోకేలో చేరాలనే డిమాండ్లు పెరిగాయని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు.

పీవోకే అనేది భారత్‌లోని భాగమే. త్వరలోనే పీఓకే భారతదేశంలో మళ్లీ చేరుతుందని చెప్పారు. పీవోకే యుద్ధం ద్వారా కాకుండా, చర్చల ద్వారా దేశానికి తిరిగి వస్తుందని అనుకోవాలా? ఇది ఎలా సాధ్యమని ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. కాశ్మీర్‌లోని ఒక భాగాన్ని పాకిస్తాన్ ఆక్రమించుకున్నందుకు దేశ ప్రజలకు ఇది బాధాకరమైన విషయంగా మిగిలిపోయింది. గిల్గిట్ బాల్టిస్తాన్ నుంచి హుంజా లోయ వరకు భారతదేశంలోకి తిరిగి రావడానికి ఎదురు చూస్తున్నాం అని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. పాకిస్తాన్ ఆక్రమించిన కాశ్మీర్‌ను తిరిగి తీసుకురావడం అనేది ప్రభుత్వం ప్రకటన మాత్రమేనా లేదా నిజంగా పీఓకేను తిరిగి భారత్‌లో విలీనం సాధ్యమవుతుందా అనే విషయాలపై రాజ్‌నాథ్ సింగ్ ప్రకటన కొన్ని సమాధానాలను ఇచ్చింది. పీవోకే అంశాన్ని పదేపదే ప్రస్తావించడం అంటే పాకిస్తాన్‌పై చర్చలకు ఒత్తిడి పెంచడం. మరోవైపు భారత ప్రతినిధులు ప్రపంచంలోని పలుదేశాలకు వెళ్లి పాక్ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని.. దాని ద్వారా ప్రపంచానికి కలుగుతున్న నష్టాన్ని కళ్లకు కట్టినట్లు వివరిస్తూ పాక్ పై దౌత్యపరంగా ఆధిపత్యం చెలాయిస్తున్నారు. పీవోకేను తిరిగి తీసుకురావడానికి రెండు మార్గాలు మాత్రమే ఉన్నాయి. మొదటి మార్గం చర్చలు జరపడం, రెండవ మార్గం సైన్యాన్ని రంగంలోకి దింపి యుద్ధం చేయడం. పీవోకేపై మాట్లాడటానికి పాక్ మీద ఒత్తిడి పెంచి చర్చలకు రప్పించాలని ప్లాన్ చేస్తోంది కేంద్రం.

అది అంత సులభం కాదు. 2019లో పార్లమెంట్‌లో అమిత్ షా పీవోకే గురించి ప్రకటన చేసినప్పుడు, దేశం మొత్తం భావోద్వేగానికి లోనైంది. పీవోకే భారత్ లోని ఓ ముక్క మాత్రమే కాదు, అది ముఖ్యమైన భాగం. గిల్గిట్ నుంచి బాల్టిస్తాన్ వరకు ఉన్న ప్రాంతం భూతల స్వర్గం లాంటిది. పాకిస్తాన్ ఆక్రమించిన కాశ్మీర్ భాగం మూడు భాగాలు అయింది. పాకిస్తాన్ ద్వారా చైనా ఆక్రమణలోకి వెళ్ళిన ఒక భాగం, దీనిని అక్సాయి చిన్ అని పిలుస్తారు. రెండవ భాగం గిల్గిట్ బాల్టిస్తాన్, మిగిలిన మూడవ భాగం పీవోకే. పాకిస్తాన్ ఆక్రమించిన కాశ్మీర్‌లోని 5,180 చదరపు కిలోమీటర్ల ప్రాంతాన్ని చైనాకు ఇచ్చింది. రెండవ భాగం అంటే గిల్గిట్‌లో 14 జిల్లాలు ఉండగా, మిగిలిన భాగం పీవోకేలో 10 జిల్లాలు ఉన్నాయి. స్వాతంత్ర్యం సమయంలో జమ్మూ కాశ్మీర్ రాజు హరి సింగ్ వేరుగా ఉండాలని చెప్పకపోతే పాకిస్తాన్ కాశ్మీర్‌లోని ఈ భాగాన్ని ఆక్రమించేది కాదు. 1947లో విభజన తర్వాత కొన్ని రోజులకు పీవోకే ఏర్పాటు ప్రారంభమయింది. 1947 ఆగస్టు 12న హరి సింగ్ భారత్‌లోనూ, పాకిస్తాన్‌తోనూ ఉండనని నిర్ణయించుకున్నాడు. జమ్మూ కాశ్మీర్‌ను స్వతంత్ర ప్రాంతంగా ఉంచాడు. కానీ కొన్ని రోజుల తర్వాత పాకిస్తాన్ సైన్యం కాశ్మీర్‌లోకి చొచ్చుకువచ్చింది. 1947 అక్టోబర్ 22న పాకిస్తాన్ గిరిజనులు ట్రక్కులలో కాశ్మీర్‌లోకి చొరబడ్డారు. అక్టోబర్ 23న జమ్మూ కాశ్మీర్‌లోని కొన్ని ప్రాంతాలను ఆక్రమించారు. దాని తరువాత. పాకిస్తాన్ పాలనపై అసంతృప్తి, పీవోకేను ఉగ్రవాద కేంద్రంగా ఉపయోగించడం ఓ కారణం.

ఆపరేషన్ సింధూర్లో లష్కర్, జైష్ ఉగ్రవాద కేంద్రాలను లక్ష్యంగా చేసుకున్న వాటిలో ఎక్కువ భాగం పీవోకేలో ఉన్నాయి. పాకిస్తాన్ ఆక్రమించిన కాశ్మీర్‌లో వారిపై వ్యతిరేకత వినిపిస్తున్న చిత్రాలు సర్వసాధారణం. పీవోకేలో ముజఫ్ఫరాబాద్, నీలం లోయ, మీర్‌పూర్, కోట్లీ వంటి ప్రాంతాలు ఉన్నాయి. ఈ ప్రాంతాలు చాలా అందంగా ఉంటాయి, కానీ పాకిస్తాన్ తమ స్వలాభం కోసం వాటి రూపురేఖలు మార్చింది. మీర్‌పూర్ నుండి భింబర్ లోయ వరకు నివసించే ప్రజలు పాకిస్తాన్ నుంచి విముక్తి పొంది శ్రీనగర్, సోనమార్గ్, గుల్మార్గ్ ప్రజల వంటి జీవితాన్ని కోరుకుంటున్నారు. ఇదంతా వ్యూహాత్మకమేనని అంచనా వేస్తున్నారు. రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ ఇటీవల .. పాకిస్తాన్ తీరుపై హెచ్చరికలు జారీ చేయడానికి కూడా ప్రత్యేకమైన వ్యూహం ఉందన్న అభిప్రాయం వినిపిస్తోంది. పాక్ ఆక్రమిత కశ్మీర్ ను స్వాధీనం చేసుకోవడం బీజేపీ ప్రభుత్వానికి దీర్ఘకాల లక్ష్యం. ఏ చిన్న అవకాశం వచ్చినా వదిలి పెట్టేందుకు సిద్ధంగా లేదు. భారతదేశం వద్ద ఉన్న దానికంటే చైనా, పాకిస్తాన్ ఆక్రమణలో అధిక భూభాగం ఉంది. పాకిస్తాన్ పీవోకేలోని పెద్ద భాగాన్ని చైనాకు అప్పగించింది. దాంతో చైనా పాకిస్తాన్‌లో తమ ప్రభావాన్ని పెంచుకుంటూ భారత్ పై ఆధిపత్యం కోసం చూస్తోంది. రోడ్డు ద్వారా కొత్త మార్గాన్ని నిర్మిస్తోంది. చైనా గిల్గిట్ ద్వారా పాకిస్తాన్‌లోకి వెళ్తుంది.

పీవోకే భారతదేశంలో చేరితే, అన్ని రకాల విభజన సమస్యల నుంచి ఉగ్రవాదం వరకు పరిష్కారం అవుతాయి. పీవోకే భారతదేశంలో చేరితే, పాకిస్తాన్, చైనా మధ్య సంబంధం బలహీనపడుతుంది. పీవోకే ద్వారా ఆ దేశాలు సహచరులుగా ఉన్నాయి. పీవోకే లభిస్తే, భారత సరిహద్దులు నేరుగా ఆఫ్ఘనిస్తాన్‌తో కలుస్తాయి. అయితే పీవోకేను స్వాధీనం చేసుకునే క్రమంలో దేశమంతా అలజడి రేగాలని కోరుకోవడం లేదు. సింపుల్ గా పనులు పూర్తి చేయాలని అనుకుంటోంది. ఆ దిశగానే జరుగుతున్న ప్రణాళికల్ని అమలు చేస్తున్నట్లుగా అనుకోవచ్చు

# అర్ధం కానీ కవిత వ్యూహం



✍ జయభేరి, హైదరాబాద్, అక్టోబరు 6 :

భారత రాష్ట్ర సమితి నుంచి సస్పెండ్ చేయడంతో కవిత పూర్తి స్థాయి జాగృతి నేతగా మారిపోయారు. ఎమ్మెల్సీ పదవికి చేసిన రాజీనామాను ఆమోదించినా ఆమోదించకపోయినా ఆ పదవి లేనట్లుగానే వ్యవహరిస్తున్నారు. ఇప్పుడు జాగృతిని బలోపేతం చేసుకునేందుకు కార్యవర్గాన్ని నియమించారు. జిల్లాల వారీగా క్యాడర్ ను రెడీ చేసుకుంటున్నారు. అయితే ఇప్పటి వరకూ ఆమె జాగృతిని రాజకీయ పార్టీగా ప్రకటించలేదు. జాగృతిలో పదవులన్నింటినీ మైనార్టీలు, గిరిజనులకే కేటాయిస్తున్నారు. ప్రధాన పదవుల్లో వారినే నియమిస్తున్నారు. ఇంత కాలం వారికి ఏ పార్టీలోనూ రాజకీయ ప్రాధాన్యత దక్కడంలేదని అంటున్నారు. అందుకే తాను ప్రాధాన్యం ఇస్తున్నానంటున్నారు. ఇక బీసీల ఎలాగూ ఉద్యమం చేస్తున్నారు. అదే విషయాన్ని గొప్పగా చెప్పుకుంటున్నారు. ఇప్పటికే సోషల్ మీడియాను కూడా కాస్త బలంగానే నిర్వహిస్తున్నారు. ఇదంతా చేస్తున్న కవిత జాగృతిని రాజకీయ పార్టీగా ప్రకటించడం మాత్రం మర్చిపోయారు. ముందుగా పార్టీ నిర్మాణాన్ని ప్రారంభించి ఆ తర్వాత పార్టీ ప్రకటన చేయాలని ప్లాన్ చేసుకున్నట్లుగా కనిపిస్తోంది. ఆమె సొంత పార్టీ పెట్టుకోవడం, రాజకీయాల్లో కొనసాగడం ఖాయమని అందరికీ స్పష్టత ఉంది. అలాంటప్పుడు మంచి రోజు చూసుకుని పార్టీని ప్రకటించకుండా... కాలమే నిర్ణయిస్తుందని చెప్పడం.. పార్టీని నిర్మించుకోవడం ఎందుకన్న ప్రశ్న వస్తోంది. కానీ కవిత తన రాజకీయం తాను చేస్తున్నారు. త్వరలో కల్వకుంట్ల కవిత రాష్ట్ర వ్యాప్త పర్యటనలు చేపట్టనున్నారు. ఈ పర్యటనల్లో మేధావులు, కవులు, కళాకారులు, వివిధ రంగాల నిపుణులతో సమావేశాలు నిర్వహించనున్నారు. ప్రజలతో పాటు ఈ రంగాల ప్రముఖుల సలహాలు, సూచనల ఆధారంగా మూడో విడత కార్యవర్గాన్ని త్వరలో ప్రకటిస్తామని కవిత తెలిపారు. కొత్త బాధ్యతలు అప్పగించిన వారు సంస్థ ఆశయాలకు అంకితమై పనిచేయాలని సూచించారు. ఈ నియామకాలు వెంటనే అమలులోకి వస్తాయని తెలిపారు. కవిత తన రాజకీయ వ్యూహంలో భాగంగా త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా పర్యటించనున్నట్లు ప్రకటించారు. ఈ పర్యటనలో ఆమె కేవలం సంస్థాగత సమావేశాలకే పరిమితం కాకుండా, వివిధ జిల్లాల్లోని మేధావులు, కవులు, కళాకారులు, సామాజిక కార్యకర్తలతో ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. వారి అభిప్రాయాలు, సూచనలను స్వీకరించనున్నారు. ప్రజల నుంచి వచ్చిన సలహాల ఆధారంగానే కమిటీ మూడో దశ నియామకాలు ఉంటాయని ఆమె చెప్పారు. దీన్నిబట్టి కవిత, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తన రాజకీయ కార్యకలాపాలను రూపొందించుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ ఉద్యమ కాలంలో ఆమె పోషించిన పాత్ర, తెలంగాణ జాగృతి ద్వారా సంపాదించుకున్న గుర్తింపును తిరిగి ప్రజల మధ్యకు తీసుకెళ్లి తన రాజకీయ భవిష్యత్తుకు బాటలు వేయాలనుకుంటున్నారు. బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ కావడం, ఇప్పుడు జాగృతి పునరుత్తేజం చేయడం.. ఇవన్నీ కవిత భవిష్యత్ రాజకీయ ప్రణాళికలపై తీవ్రమైన చర్చకు దారితీస్తున్నాయి. ఆమె కేవలం జాగృతి వేదికగా సామాజిక ఉద్యమకారిణిగా మాత్రమే కొనసాగుతారా? లేకుంటే ఈ వేదికను ఉపయోగించుకుని కొత్త రాజకీయ పార్టీని స్థాపిస్తారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రస్తుతానికి ఆమె ప్రకటనలు పూర్తిగా సామాజిక న్యాయం, తెలంగాణ అస్తిత్వం, ప్రజల సలహాల సేకరణ చుట్టూ తిరుగుతున్నాయి. అయితే, బీఆర్ఎస్ పార్టీ బలహీనపడుతున్న ఈ తరుణంలో, ఆమె ఎంచుకున్న ఈ మార్గం తెలంగాణ రాజకీయాలపై ప్రభావం చూపవచ్చు.


# హెచ్ఎండిఏ కార్యాలయానికి తరలిన భూ నిర్వాసితులు

- అలాన్మెంట్ మార్చే వరకు పోరాడుతాం
- సిపిఎం పార్టీ డివిజన్ కార్యదర్శివర్గ సభ్యులు శ్రీను నాయక్

**జయభేరి, షాద్ నగర్, అక్టోబర్ 06 :**



ట్రిబుల్ ఆర్ అలైన్మెంట్ మార్చాలని డిమాండ్ చేస్తూ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్ హెచ్ఎండిఏ కార్యాలయా ముట్టడికి షాద్ నగర్ నుంచి భూ నిర్వాసితులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు శ్రీను నాయక్ మాట్లాడుతూ; ట్రిబుల్ ఆర్ రోడ్ అలైన్మెంట్ మార్చాలని డిమాండ్ చేస్తూ షాద్నగర్ నియోజకవర్గం కేంద్రం నుంచి కేశంపేట్ మండలం గ్రామస్తులు 9 రేకుల నిడద వెళ్లి ఫరూక్నగర్ మండలంలోని భీమారం అయ్యవారిపల్లి ఉప్పరిగడ్డ తండా కొందుర్గు మండలంలోని తంగేళ్లపల్లి చెరుకుపల్లి తుమ్మలపల్లి ట్రిబుల్ ఆర్ బాధిత రైతు కుటుంబాలు ధర్నాకు తరలి వెళ్లినట్లు ఆయన తెలిపారు. ఈ మధ్యకాలంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అలైన్మెంట్ను ప్రకటిస్తూ అట్లాగే రూట్ మ్యాప్ ఇస్తూ సర్వే నెంబర్లతో సహా ఇవ్వటం వలన ఆ సర్వే నెంబర్ లో ఉన్నటువంటి రైతులు అనేక తీవ్రమైన ఇబ్బందులకు గురవుతూ అనేక రూపాలలో నిరసన వ్యక్తం చేయాలని ముఖ్యంగా ఈ ట్రిబుల్ ఆర్ అలైన్మెంట్ మ్యాపు లో ఉన్నటువంటి భూముల పట్టాదారులు మొత్తం పేద రైతాంగం ఒక్కొక్కరికి రెండు ఎకరాలు మూడు ఎకరాలు ఉన్నటువంటి పేదలు మాత్రమే ఉన్నారు ఇట్టి పేద రైతులు అట్టి భూములపై వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నటువంటి పరిస్థితి ఉంది ఇలాగే ట్రిబుల్ ఆర్ అలైన్మెంట్ ఒకచోట ఒకరకంగా ఇంకోచోట ఇంకోరకంగా ప్రకటిస్తూ ఇది కేవలం ఎక్కడ ప్రకటించిన అట్టి భూముల రైతులు పేద రైతులు ఉన్నారు ఇది కేవలం పెట్టుబడుదారుల ప్రయోజనం కోసమే ఈ ట్రిబుల్ ఆర్ అలైన్మెంట్ను చేస్తున్నారని ఇది పేద రైతుల కోసం కాదని ఇది పేదరిక రైతుల కోసం కాదని అందుకనే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి నిత్యం వ్యవసాయం చేసుకొని జీవిస్తున్నటువంటి మా పేద రైతుల పొట్ట కొట్టొద్దని రైతులు తీవ్రమైనటువంటి ఆందోళన గురవుతున్నారని అన్నారు. కాబట్టి పాత అలైన్మెంట్ ప్రకారమే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిచో రైతులను సమీకరించుకొని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని రైతులకు న్యాయం జరిగే వరకూ ఈ పోరాటం కొనసాగుతుందని రైతుల పక్షాన పోరాడి సాధించేవరకు ఈ పోరాటాన్ని వదిలే ప్రసక్తి లేదని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



## బీజేపీ జడ్పీటీసీ అభ్యర్థిగా అవకాశం ఇవ్వండి

**జయభేరి, జనగామ, అక్టోబర్ 06 :**

జనగామ మండల బీజేపీ జడ్పీటీసీ అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలని పార్టీ జిల్లా కార్యాలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు సౌడ రమేష్ కు దరఖాస్తు పెట్టుకోవడం జరిగింది. గత 20 సంవత్సరాలుగా దేశం కోసం ధర్మం కోసం జానహిత ఏకోపాధ్యాయ పాఠశాలతో ప్రారంభించి... భజరంగ్ దళ్. విశ్వహిందూ పరిషత్. బీజేవైఎం. మండల అధ్యక్షులు గా బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి గా. బీజేపీ ఎస్సి మోర్చ జిల్లా అధ్యక్షులు గా పని చేశామని కావున జనగామ జడ్పీటీసీ ఎస్సి జనరల్ అయినందున ఈ ఒక్క అవకాశం నాకు ఇవ్వగలరని వినతి పత్రం ఇవ్వడం జరిగింది.

## శబరిమల విగ్రహాల బంగారం మాయం..

- సిట్ దర్యాప్తునకు కేరళ హైకోర్టు ఆదేశం




**జయభేరి, కేరళ, అక్టోబర్ 6 :**

కేరళలోని సుప్రసిద్ధ శబరిమల దేవాలయంలోని ద్వారపాలకుల విగ్రహాల బంగారం మాయమవడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. బంగారు పూత పూసిన రాగి పలకల నుంచి బంగారం మాయమవడంపై కేరళ హైకోర్టు తాజాగా సిట్ దర్యాప్తునకు ఆదేశించింది.ట్రావెన్కోర్ దేవస్వం బోర్డు విజిలెన్స్ బృందం ఈ విషయంపై తన ప్రాథమిక దర్యాప్తుపై మధ్యంతర నివేదిక సమర్పించిన అనంతరం కేరళ హైకోర్టు ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. న్యాయమూర్తులు జస్టిస్ రాజా విజయరాఘవన్, జస్టిస్ కేవీ జయకుమార్లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలిచ్చింది. దర్యాప్తును గోప్యంగా నిర్వహించాలని, నివేదికను నేరుగా కోర్టుకు సమర్పించాలని స్పష్టం చేసింది.019లో ద్వారపాలకుల విగ్రహాలకు ఉన్న బంగారు పూత పూసిన రాగి పలకలను తాపడం కోసం తొలగించారు. దీని కోసం స్పెషల్ కమిషనర్ నుంచి కానీ, కోర్టు నుంచి కానీ ముందస్తు అనుమతి తీసుకోలేదు. కనీసం సమాచారం ఇవ్వలేదు. అప్పుడు వాటి బరువు 42.8 కిలోలు. కానీ ఈ రాగి పలకలు చెన్నైలోని ఓ సంస్థకు చేరేసరికి వీటి బరువు 38.258 కేజీలు మాత్రమే ఉంది. అంటే 4.54 కేజీల బంగారం తగ్గిపోయింది. ఓ భక్తుడి ద్వారా వాటిని చెన్నైకి పంపడం కూడా వివాదానికి దారితీసింది. ఈ వ్యవహారంపై కేరళ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది చాలా తీవ్రమైన, వివరణ లేని వ్యత్యాసం అని పేర్కొంది.వాస్తవానికి ఈ ద్వారపాలకుల విగ్రహాలను 1999లో 40 ఏళ్ల వారంటీతో ఏర్పాటు చేశారు. అయినప్పటికీ, కేవలం ఆరేళ్లకే తాపడంలో లోపాలు తలెత్తడంతో మరమ్మతులు చేపట్టాల్సి వచ్చింది. 2019లో ట్రావెన్కోర్ దేవస్వమ్ బోర్డు మరమ్మతులు చర్యలు చేపట్టింది. అయితే, వారు స్పెషల్ కమిషనర్కు గానీ, కోర్టుకు గానీ ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండానే ఈ బంగారు రేకులను తొలగించడం వివాదానికి కారణమైంది. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు దర్యాప్తునకు ఆదేశించింది.

# జోరుగా అక్రమ నిర్మాణాలు

- చోద్యం చూస్తున్న అధికారులు
- నోటీసు ఇచ్చి చేతులు దులుపుకున్న వైనం
- మైసమ్మగూడలో నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్థుల నిర్మాణాలు

**జయభేరి, మేడ్చల్ :**



వడ్డించేవాడు మనవాడైతే.. బంతిలో ఎక్కడ కూర్చున్నా ఒకటే.. అనేది పాత సామెత గుండ్ల పోచంపల్లి మున్సిపల్ అధికారులకు పక్కాగా సరిపోతుంది. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో అక్రమ నిర్మాణాల విషయంలో అచ్చం అలాగే ఉంది గుండ్లపోచంపల్లి మున్సిపల్ అధికారుల పనితీరు చూస్తుంటే, మున్సిపాలిటీ పరిధిలో అక్రమాలను ఉపేక్షించబోమని అధికారులు చెబుతున్నా అవి ప్రకటనలకు మాత్రమే పరిమితం అయ్యాయి. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో 15 వార్డులు ఉండగా నిత్యం ఏదో ఒకచోట అక్రమ నిర్మాణాలు జోరుగా కొనసాగుతున్నాయి. ఒకరు జి+ రెండు అంతస్తులు అనుమతులతో జి+ ఐదు లేదా ఆరు అంతస్తుల భవనాలు నిర్మాణాలు చేస్తుంటే మరొకరు రేషిడెన్షియల్ అనుమతులు తీసుకొని కమర్షియల్ నిర్మాణాలు చేస్తున్నారు. మరికొందరు అయితే వ్యవసాయ భూమిని నాలా కన్వర్షన్ లేకుండానే నిర్మాణాలు చేస్తున్నారు. ఇలా నిత్యం మున్సిపాలిటీ పరిధిలో ఏదోఒక చోట ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పొడుస్తూ మున్సిపల్ ఖజానాకు భారీగా నష్టాన్ని కలిగిస్తున్నారు. ఇంతలా అక్రమాలు జరుగుతున్న వాటిని గుర్తించి చర్యలు తీసుకోవాల్సిన మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారుల మౌనం వెనుక ఆంతర్యం ఏమిటి అనే ప్రశ్నలకు సమాధానాలు తెలియడం లేదని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ఒకవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అక్రమ నిర్మాణాలను నిర్మూలన కోసం హైడ్రా తీసుకువచ్చి అక్రమార్కులకు చెమటలు పట్టిస్తుంటే గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ అధికారులు దానికి భిన్నంగా అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారని వాదనలు వినిపిస్తున్నాయి.

**మైసమ్మగూడలో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు**

గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని మైసమ్మగూడలో ఎక్కడ చూసినా విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు సాగుతున్నాయి. ఇక్కడ మల్లారెడ్డి విద్యాసంస్థలు ఉండటంతో విద్యార్థుల వసతి కోసం హాస్టళ్ల వ్యాపారానికి చాలా డిమాండ్ ఉంది. దింతో కొందరు బిల్డర్ల అవతారం ఎత్తి ఇష్టానుసారంగా భావన నిర్మాణాలు చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి ఎలాంటి సెట్ బ్యాక్స్ లేకుండా జి+రెండు అంతస్తుల అనుమతులతో ఐదు అంతస్తుల భవనాలను నిర్మిస్తున్నారు. ఇలాంటి అక్రమాలను అరికట్టేందుకే ప్రభుత్వం ఏర్పాటు చేసిన మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు మాత్రం అక్రమ నిర్మాణాలపై ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారుల అండదండలతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారని అధికారుల చేతివాటం ఉండటంతో ఇలాంటి నిర్మాణాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని పలువురు అధికారుల తీరుపై విమర్శలు చేస్తున్నారు.

**టౌన్ ప్లానింగ్ విభాగం ఎక్కడ..?**

గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను అరికట్టాల్సిన టౌన్ ప్లానింగ్ విభాగం పూర్తిగా విఫలమైందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం జరగాల్సిన నిర్మాణాలు ప్లానింగ్ లో అనుమతులు పొందిన దానికి భిన్నంగా జరుగుతున్నాయి. భావన నిర్మాణం అనుమతులు డాక్యుమెంట్ లో ఒకలా ఉంటే నిర్మాణలు మరోలా జరుతుతున్నాయి. దింతో పన్నుల రూపంలో మున్సిపాలిటీకి రావాల్సిన ఖజానాకు భారీగా గండీ ఏర్పడుతుంది. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీకి గతకొంత కాలంగా పూర్తి స్థాయిలో టౌన్ ప్లానింగ్ అధికారి లేకపోవడంతో అక్రమ నిర్మాణాల విషయంలో కొంతమంది ఆడింది ఆటగా తయారైంది. అక్రమ నిర్మాణాలు అరికట్టాల్సిన అధికారులు తూతు మంత్రంగా నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటున్నారే తప్ప చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలం అవుతున్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలి



**జయభేరి, గార్ల, అక్టోబర్ 6:**

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల తో దూసుకుపోతున్న కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పట్టాలని,స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ శ్రేణులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పిలుపునిచ్చారు. మండల పరిధిలోని వర్తక సంఘం భవనంలో స్థానిక సంస్థల సన్నాహక సమావేశం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ధనియాకుల రామారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మండల పరిధిలోని 11 ఎంపీటీసీ స్థానాలు,,20 సర్పంచు స్థానాలు,ఒక జడ్పిటిసి స్థానాన్ని కైవసం చేసుకోవాలని కోరారు.ప్రజా ప్రభుత్వంలో అభివృద్ధి,సంక్షేమ పథకాలు ప్రతి గడపకు చేరుతున్నాయని ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, మాజీ జెడ్పిటిసి జాటోత్ ఝాన్సీ లక్ష్మి, మాజీ ఎంపీపీ మాలోత్ వెంకట్ లాల్, ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ భూక్య నాగేశ్వరరావు, గుండా వెంకట్ రెడ్డి, తాళ్లపల్లి కృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## శిక్షణ తరగతులకు హాజరు కాని వారిపై చర్యలు తప్పవు

**జయభేరి, తుర్కపల్లి, అక్టోబర్ 06:**

శిక్షణా తరగతులకు హాజరు కాని వారిపై క్రమశిక్షణ చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. సోమవారం జెడ్పిటిసి, ఎంపీటీసీ, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకై ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులను తుర్కపల్లి మండల కేంద్రంలోని రైతు వేదిక నందు ప్రోసిడింగ్ ఆఫీసర్లకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జడ్పిటిసి, ఎంపీటీసీ, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణక ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులకు హాజరు కాని వారిపై క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏ ఒక్కరు కూడా మినహాయింపు ఇవ్వబడదు అన్నారు. ప్రతి ఒక్కరు తప్పనిసరిగా విధులకు హాజరు కావాల్సిందేనని అన్నారు. ప్రతి ఒక్కరు శిక్షణ కార్యక్రమంలో పాల్గొనాలని శిక్షణ కార్యక్రమం కు హాజరు కాని వారిపై చర్యలు తప్పవని అన్నారు. ఈ ఎలక్షన్లలో నిర్వహణలో ఎలాంటి తప్పులు చేయకుండా నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని అన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే వెంటనే నివృత్తి చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, జిల్లా పశు వైద్యాధికారి పి జానయ్య ,తహసిల్దార్ దేశ్యా నాయక్, ఎంపీడీవో లెంకల గీతారెడ్డి, ఎంపీఓ వెంకటేశ్వర్లు, మండల ఎన్నికల ట్రైనర్స్ అశోక్, నాగిరెడ్డి, ప్రోసిడింగ్ అధికారులు పాల్గొన్నారు.

## మా పిల్లలకు గురువులు కావాలి



**జయభేరి, బయ్యారం, అక్టోబర్ 6:**

మహబూబాబాద్ జిల్లా,బయ్యారం మండల కేంద్రంలోని మోట్లగూడెం గిరిజన ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత తీర్చాలని విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలతో కలిసి కలెక్టరేట్ కార్యాలయం ఎదుట మా పిల్లలకు గురువులు కావాలి అనే నినాదంతో చేతులలో ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ, పాఠశాలల్లో నెలలు తరబడి ఉపాధ్యాయులు లేకపోవడం మూలంగా విద్యార్థుల చదువులకు ఆటంకం కలుగుతుందని,జిల్లా ఉన్నత అధికారులు చర్యలు తీసుకొని త్వరితగతిన పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు. మారుమూల ఏజెన్సీ గ్రామీణ ప్రాంతాల్లో విద్యాహక్కు ప్రతి విద్యార్థికి అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉండాలని తక్షణమే ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.విద్యార్థులకు డిఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం సంపూర్ణ మద్దతును తెలిపి నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి దక్షిణామూర్తి కి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు డిఎస్ఎఫ్ఐ నాయకులు కేలోత్ సాయికుమార్, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## వీధి దీపాలు ఏర్పాటు చేయండి




**జయభేరి, మేడ్చల్ :**

కండ్లకోయ ప్రధాన రోడ్డు వెంట వీధి దీపాలు లేకపోవడంతో ప్రజలు రాత్రి సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ నాయకులు కృష్ణ గౌడ్ అన్నారు. జాతీయ రహదారి నుండి కండ్లకోయ గ్రామం వరకు ఉన్న వీధి దీపాలు సరిగ్గా వెలగడం లేదని వాటిని మార్చి కొత్తగా వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం గుండ్లపోచంపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణ గౌడ్ మాట్లాడుతూ కండ్లకోయ చౌరస్తా నుండి గ్రామం వైపు వచ్చే దారిలో వీధి దీపాలు వెలగడం లేదని దీంతో రాత్రి సమయంలో గ్రామం వైపు వచ్చే పాదచారులు, వాహనదారులకు ప్రమాదకరంగా మారిందన్నారు. అధికారులు స్పందించి వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్, నాయకులు అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ పూజా కార్యక్రమం

- ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవంలో పాల్గొన్న బోడుప్పల్ మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి.



**జయభేరి, మేడిపల్లి :**

బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 18వ డివిజన్లో నిర్మితమైన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ పూజా కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రెష్ యాదవ్, మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ తో కలిసి పూజా కార్యక్రమంలో పాల్గొన్న బోడుప్పల్ మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మా రెడ్డి. ఈ కార్యక్రమంలో బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శైలజ, సీనియర్ నాయకులు రాపోలు రాములు, మేడ్చల్ నియోజకవర్గం బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు బొమ్మకు కళ్యాణ్, చీరాల నరసింహ, పోగుల వీర రెడ్డి, హరినాథ్ రెడ్డి, గుర్రాల వెంకటేష్ యాదవ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## రైతుల పక్షాన ఉండేది కేవలం ప్రజా ప్రభుత్వం మాత్రమే

- శివరాజ్ యాదవ్

**జయభేరి, జనగామ, అక్టోబర్ 06 :**
జనగామ వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులకు అందుబాటులో ఉండే విధంగా ఈ సీజన్లో ఐకెపి సెంటర్లు రెండు నిర్వహించాలని గౌరవ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ గారిని కోరిన జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శివరాజ్ యాదవ్ మాట్లాడుతూ జనగామలో రైతులకు మేము నిత్యం అందుబాటులో ఉంటూ ప్రతి రైతుకు అండగా ఉంటున్నాము అని అన్నారు. అదేవిధంగా కొన్ని సందర్భాల్లో ఇంటర్నేషనల్ ఎక్స్పోర్ట్ ధరలు తక్కువ ఉన్నందున ప్రైవేటు వ్యాపారస్తులు రైతులకు తక్కువ ధరలో కొనుగోలు చేయడం జరుగుతుంది అని అన్నారు. కావున రైతులకు ఇబ్బందులు రాకుండా ఈ ప్రజా ప్రభుత్వం లో రైతులకు మద్దతు ధర పొందాలని ఉద్దేశంతో తొందరలో రెండు ఐకెపి సెంటర్లు (కొనుగోలు కేంద్రంలు) నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ని కోరడం జరిగిందని అన్నారు.జిల్లా కలెక్టర్ గారు వెంటనే సానుకులంగా స్పందించి జనగామ వ్యవసాయ మార్కెట్ యార్డులో రెండు ఐకెపి సెంటర్లు ఏర్పాటు చేయుటకు సంబంధిత అధికారులకు చర్యలు చేపట్ట వలసింది గా ఆదేశించారు, కావున తొందర్లో రైతులకు మద్దతు ధరలతో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుంది అని ఏఎంసీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీ బెన్సీ లోమ్ గారు,DRDO PD వసంత, ఏఎంసీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి జీవన్ కుమార్, సూపర్వైజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరిక



**జయభేరి, జనగామ, అక్టోబర్ 06 :**
దేవరుప్పుల మండలకేంద్రంలో కాశవాడకు చెందిన బీఆర్ఎస్ పార్టీకి చెందిన సుమారు 30 కుటుంబాలు దేవరుప్పుల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నల్ల శ్రీరామ్ ఆధ్వర్యంలో పాలకుర్తి శాసన సభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.పార్టీలో చేరిన కుటుంబాలకు ఎమ్మెల్యే యశస్విని రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తన సత్తా చాటాలని ,ప్రజల మద్దతుతో కాంగ్రెస్ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని, అభివృద్ధి, సంక్షేమం, ప్రజల హక్కుల పరిరక్షణ కోసం కృషి చేసే పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని,ప్రజల ఆశయాలకు అనుగుణంగా పని చేసే నాయకత్వం కాంగ్రెస్దేనని,ప్రతి గ్రామం, ప్రతి కుటుంబం కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలితాలు అందుకోవాలంటే కార్యకర్తలు గ్రామస్థాయిలో మరింత చురుకుగా ఉండాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో దేవరుప్పుల మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు,మండల యువజన నాయకులు, మహిళా నాయకురాళ్లు,గ్రామ కాంగ్రెస్ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ బాకీ కార్డు ఉద్యమం



**జయభేరి, మేడ్చల్, అక్టోబర్ 6:**
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన నయవంచక హామీలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు "బాకీ కార్డు ఉద్యమం"ను మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా చేపట్టాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో మేడ్చల్ బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు ఆధ్వర్యంలో పార్టీ ప్రజా ప్రతినిధులు, ముఖ్యనాయకులు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి మల్లా రెడ్డి, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణరావు, వివేకానంద గౌడ్, బండారి లక్ష్మా రెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి అలాగే మాల్కాజ్గిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిలతో పాటు జిల్లా ముఖ్యనాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన 420 హామీలను పూర్తిగా మోసం చేసిందని, ప్రజలను మభ్యపెట్టిందని విమర్శించారు. ప్రజల పట్ల ఈ కాంగ్రెస్ మోసపూరిత వైఖరిని, వంచనను బయట పెట్టడానికి బీఆర్ఎస్ పార్టీ "బాకీ కార్డు" రూపంలో ప్రజల్లోకి వస్తోందని పేర్కొన్నారు.

## సమస్యల పరిష్కార దిశగా కృషి చేస్తా..

- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**జయభేరి, కాప్రా :**
మీర్పేట్ హెచ్ బి కాలనీ డివిజన్ లోని పలు కాలనీలలో 52 లక్షల అంచనా వ్యయంతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మరియు సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అభివృద్ధి విషయంలో అవసరమైన సహకారం అందిస్తూ ఎల్లవేళలా మీకు అందుబాటులో ఉంటానని, ఉప్పల్ నియోజకవర్గం యొక్క అభివృద్ధికి పూర్తి స్థాయిలో కృషి చేస్తానని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే కాలనీవాసుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ మాట్లాడుతూ.. డివిజన్ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కార దిశగా కృషి చేస్తామని డివిజన్ అభివృద్ధి విషయంలో ఎల్లవేళలా సహకారం అందిస్తున్న ఎమ్మెల్యేకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పనుల వివరాలు: డైమండ్ హిల్స్ చర్చ్ దగ్గర అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం, వెంకటేశ్వరనగర్ మదర్ తెరిసా స్కూల్ ప్లే గ్రౌండ్ పక్కన, తిరుమలనగర్ దేవీ అపార్ట్మెంట్ ఎదురు రోడ్డు, నరసింహ నగర్ షణ్ముఖ రెసిడెన్సి (ఝాన్సీ స్కూల్ దగ్గర) కాలనీలలో సీసీ రోడ్డు నిర్మాణం. ఈ కార్యక్రమంలో డీఈ రూప, వర్క్ ఇన్స్పెక్టర్ చారి, నాయకులు వంజరి ప్రవీణ్ కరిపే, ఉల్లెం బాలరాజు, మల్లారెడ్డి, ఇక్బాల్, అరిఫుద్దీన్, వీరభద్రరావు, మల్లేష్ గౌడ్, బోదాసు రవి, వెంకట్, మురళి, నరసింహ గౌడ్, కృష్ణ, చంద్రశేఖర్, రామకృష్ణ, చక్రవర్తి, దాసు, కిరణ్, శేఖర్ గౌడ్, శివ, దండెం నరేందర్, నిసార్ అహ్మద్ గోరి, కాలనీవాసులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కండి

- నాయకుని గెలుపులోనే ప్రతి కార్యకర్త ఆనందం
- పార్టీకి పునాదులే కార్యకర్తలు
- చౌదరి కూడా మండల అధ్యక్షుడు ఎదిర రాజు ఆధ్వర్యంలో ఎన్నికల కోసం మండల కార్యశాల
- కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందే బాబయ్య



**జయభేరి, షాద్ నగర్, అక్టోబర్ 06 :**
స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కండి. గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరు కలిసిమెలిసి పని చేయాలి. బీజేపీ చౌదరిగూడ మండల అధ్యక్షులు ఎదిర రాజు ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ఎన్నికల కోసం సోమవారం మండల



కార్యశాల ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంది బాబయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిజెపి నేతలు మాట్లాడుతూ; స్థానిక సంస్థల కోసం అందరూ సన్నద్ధం కావాలని, భారతీయ జనతా పార్టీకి కార్యకర్తలే ముఖ్యమైన పట్టు అని అంటూ, గెలుపు కోసం ప్రతి కార్యకర్త కష్టపడాలని, వచ్చిన అవకాశాన్ని మనం విడుచుకోవద్దని, సమిష్టిగా పోరాడి మన నాయకుల విజయం కోసం శ్రమించాలని, ఘనంగా కార్యకర్తలు ఉన్న ఏకైక పార్టీ బిజెపి పార్టీయే అంటూ మన నాయకుల గెలుపులోనే మన కష్టం కనిపిస్తుందని, అందులోనే మన సంతోషం ఉంటుందని, పక్కా ప్రణాళికతో, సమిష్టి పోరాటంతో, అందరం కలగలిసి నాయకుల గెలుపుకు కృషి చేయాలని, స్థానిక సంస్థలలో మనం మెజారిటీ సీట్లు సాధించినప్పుడే రాష్ట్రంలో బిజెపి పార్టీ అధికారంలోకి రావడానికి అవకాశాలు ఉంటాయి కనుక వచ్చిన ఈ అవకాశాన్ని ఎవరు విడుచుకోవద్దని సంఘటన్ మే శక్తి హై అని నిరూపించాలని బిజెపి నేతలు తమ కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ మనోహర్ రెడ్డి, రాష్ట్ర చేనేత కన్వీనర్ మచ్చ సుధాకర్ రావు, జిల్లా ఉపాధ్యక్షులు కమ్మరి భూపాల చారి, జిల్లా కార్యవర్గ సభ్యులు కోనేరు శ్రీనివాస్, యువ నాయకులు ప్రశాంత్, కురుమయ్య, ప్రధాన కార్యదర్శులు కొండ శ్రావణ్ కుమార్ గొల్ల రాజు పాల్గొన్నారు

# డాక్టరేట్ పట్టా అందుకున్న కొర్ర కిషన్ నాయక్

- డే స్ప్రింగ్ థియోలాజికల్ యూనివర్సిటీ టెక్సాస్ యుఎస్ఏ

**జయభేరి, దేవరకొండ :**
సమాజంలో సమాచార హక్కు చట్టం పై ప్రజలు మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం మరింత పెరిగిందని సమాచార హక్కు చట్టం రక్షణ సమితి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు కొర్ర కిషన్ నాయక్ అన్నారు. హైదరాబాదులో సోమవారం నాడు డే స్ప్రింగ్ థియోలాజికల్ యూనివర్సిటీ టెక్సాస్ యు ఎస్ ఏ వారు గౌరవ డాక్టరేట్ పట్టాను నల్లగొండ జిల్లా గుండ్లపల్లి (డిండి) మండలం కొత్త తండా కు చెందిన సమాచార హక్కు చట్టం రక్షణ సమితి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు కొర్ర కిషన్ నాయక్ చేసిన సేవలను గుర్తించి ఘర్షణ శ్రీనివాస్ పుష్ప రాజశేఖర్ సినీ ప్రముఖుల చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్ పట్టాను అందుకోవడం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ ఆర్.టి.ఐ సమాచార హక్కు చట్టం పై ప్రజలలో అవగాహన కల్పిస్తూ ప్రజల కోసమే రూపొందించబడిన ఆర్టిఐ పై ప్రజలలో మరింత మేలు




కొలుపును పెంపొందించే దిశగా ముందుకు వెళుతున్న క్రమంలో ఇలాంటి గౌరవ డాక్టరేట్ ను అందించడం శుభ తరుణమని వారన్నారు. ఈ గౌరవ డాక్టరేట్ పట్టా 1అందుకోవడంతో పాటు మరింత బాధ్యత పెరిగిందని ప్రజలు ప్రభుత్వం రూపొందించిన చట్టాలను వినియోగించుకోవాలని ప్రతి ఒక్కరికి చట్టంలో ప్రశ్నించే అధికారం ఉందని ప్రజలు ప్రభుత్వ అధికారులు పనితీరులోనీ ప్రజల స్వంతమైన చట్టపరమైన అంశాలను ప్రజలు ఉపయోగించుకోవాలని వారు కోరారు. రానున్న రోజులలో సమాచార హక్కు చట్టంపై రాష్ట్రవ్యాప్తంగా ప్రజలలో అవగాహన కొరకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయబోతున్నామని ప్రజలు సమాజం పట్ల బాధ్యత కలిగిన యువకులు ముందుకు రావాలని వారు తెలిపారు.

# గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించిన ఆయుష్ కరాటే అకాడమీ ఆఫ్ ఇండియా



**జయభేరి, దేవరకొండ :**
అయుష్ కరాటే అకాడమీ ఆఫ్ ఇండియా ఘన విజయాన్ని సాధించింది. ఈ అకాడమీలో శిక్షణ పొందిన విద్యార్థులు తమ ప్రతిభ, క్రమశిక్షణ, మరియు కష్టపాటుతో ప్రపంచ రికార్డు సృష్టించి భారతదేశానికి గౌరవం తీసుకువచ్చారు. ఈ గిన్నిస్ ప్రోగ్రామ్ వరల్డ్ కరాటే మాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, మాస్టర్ బాల మురుగన్ సమన్వయంతో చెన్నైలోని S.I.V.E.T కాలేజీ లో జరిగింది. ఈ వేడుకకు గిన్నిస్ అధికార ప్రతినిధి శ్రీ రిషి నాథ్ ముఖ్య అతిథిగా హాజరై, ఆయుష్ కరాటే అకాడమీ ఆఫ్ ఇండియా వ్యవస్థాపకుడు మరియు డైరెక్టర్ మాస్టర్ టీ. చైతన్య గిన్నిస్ మెడల్ సర్టిఫికేట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో AKS వినోద్ సర్వాగి (డిస్ట్రిక్ట్ గవర్నర్ 2025-2026) ఎన్.ఎస్. సరవణన్ (ఇమిడియేట్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్) ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొని విద్యార్థులను అభినందించారు. మాస్టర్ టీ. చైతన్య శిక్షణలో విద్యార్థులు పున్న శ్రీజన్ ,మాకం అఖిల్, తుటిక జయ సాయి కార్తిక్ తమ అంకితభావం, క్రమశిక్షణ మరియు నిరంతర శ్రమతో ఈ గిన్నిస్ రికార్డు సాధించారు. వారి తల్లిదండ్రులు — పున్న కిరణ్ కుమార్ & పున్న నాగ భవాని,తుటిక కుమార్ తుటిక సిరి మాకం రాజు మాకం జ్యోతి తమ పిల్లలు ప్రపంచ రికార్డు సాధించినందుకు ఆనందం వ్యక్తపరిచి, మాస్టర్ చైతన్య కి తమ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ విజయంతో అయుష్ కరాటే అకాడమీ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్రంలోనే కాకుండా దేశవ్యాప్తంగా గౌరవనీయ స్థానం సంపాదించింది. ఈ ఘనత ద్వారా అనేకమంది విద్యార్థులు ప్రేరణ పొందుతున్నారు. మాస్టర్ టీ. చైతన్య కి గిన్నిస్ రికార్డు సాధించిన విద్యార్థులకు హృదయపూర్వక అభినందనలు ఇది దేవరకొండకు, అలాగే భారతదేశానికి గర్వకారణమైన ఘనత అని చైతన్య మాస్టర్ తెలియజేసినారు.



## ఉద్యమానికి మల్లోజుల గుడ్ బై

**జయభేరి, న్యూఢిల్లీ, అక్టోబరు 6:**
మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ సంచలన ప్రకటన చేశారు. పార్టీని వీడుతున్నట్లు క్యాడర్ కు లేఖ ద్వారా స్పష్టం చేసిన మల్లోజుల క్యాడర్ అంతా అదే నిర్ణయం తీసుకోవాలని పిలుపునిచ్చారు. పార్టీ క్యాడర్ కు లేఖ రాసిన లేఖలో సాయుధ పోరాట విరమణ పై స్పష్టమైన ప్రకటన చేశారు. మావోయిస్ట్ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, పొలిట్ బ్యూరో సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ @ అభయ్ @ సోను ఇంతకాలం పార్టీలో బాధ్యత వహించిన పదవిలో ఇక తాను ఉండలేనని వెల్లడించారు. సోను పేరుతో మొత్తం 22 పేజీలతో కూడిన ఈ లేఖలో అనేక అంశాల ప్రస్తావన ఉంది. ఇదే దశలో పార్టీ అప్పగించిన బాధ్యతల్లో కొనసాగే అంశంలో ఆయన స్పష్టతనిచ్చారు. 'ఆయుధాలు వదిలేస్తాం' అంటూ కొద్దిరోజుల క్రితం మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ అభయ్ ఓ ప్రకటన విడుదల చేశారు. అభయ్ తన వద్ద గల ఆయుధాలను అప్పగించాలని, లేనిపక్షంలో పీపుల్స్ గెరిల్లా ఆర్మీ స్వాధీనం చేసుకుంటుందని పార్టీ ప్రకటన జారీ చేసింది. క్యాడర్ కు లేఖ రాసిన మావోయిస్టు పొలిట్ బ్యూరో సభ్యుడు మల్లోజుల ఈ అంశంపై వివరణ ఇచ్చారు.సాయుధ పోరాట విరమణ పై స్పష్టమైన చేశారు మల్లోజుల. పార్టీ అధికార ప్రతినిధి జగన్ కు కౌంటర్ ఇచ్చారు. పార్టీలో అంతర్గతంగా చర్చించిన తర్వాతే ఆయుధాలు వీడాలని పేర్కొన్నారు. పార్టీ ప్రధాన కార్యదర్శి బతికున్నప్పుడే తీసుకున్న నిర్ణయం అంటూ మల్లోజుల లేఖలో పేర్కొన్నారు. పార్టీ చేసిన కొన్ని తప్పుల వల్ల తీవ్ర నష్టాన్ని చవి చూడాల్సి వచ్చిందన్నారు. ఉద్యమం ఓటమి పాలు కాకుండా కాపాడలేకపోయామంటూ క్షమాపణలు చెప్పారు. పార్టీ క్యాడర్ను కాపాడుకొని అనవసర త్యాగాలకు ఫుల్ స్టాప్ పెట్టాలని చెప్పారు. మావోయిస్టు పార్టీ ఇప్పటివరకు కొనసాగించిన పంథా పూర్తిగా తప్పిదమేనని మల్లోజుల అభిప్రాయ పడ్డారు. తప్పుల నుంచి గుణపాఠాలు నేర్చుకోవడం అంటే టీకా లాంటిదని ఆయన సూచించారు. వర్తమాన ఫాసిస్టు పరిస్థితులలో మన లక్ష్యాన్ని నెరవేర్చలేమన్నారు. సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకుంటారని క్యాడర్ కు పిలుపునిచ్చారు. మొత్తం తాజా పరిణామాల్లో అభయ్ అలియాస్ సోను పేరుతో మరో 22 పేజీల లేఖ బయటకు వచ్చింది. మావోయిస్టు పార్టీని వచ్చే ఏడాది మార్చి 31లోపు తుదముట్టిస్తమని కేంద్రహోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. ఈ మేరకు బలగాలు మావోయిస్టులను వెంటాడుతున్నాయి. ఈ క్రమంలో చాలా మంది పెద్ద స్థాయి నక్సలైట్లు ఎన్ కౌంటర్ లో చనిపోతున్నారు. కొంత మంది లొంగిపోతున్నారు. వందల మంది మావోయిస్టు క్యాడర్ తో పాటు.. తలలపై రూ.కోటి వెల ఉన్న నక్సలైట్లు కూడా లొంగిపోతున్నారు. ఈ క్రమంలో మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ సోను కూడా లొంగిపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# దేశంలోనే ఫార్మా హబ్‌గా ప్రఖ్యాతి

- ఫార్మా రంగంలో దిగ్గజ సంస్థ ఎలి లిల్లీ కాంట్రాక్ట్ మాన్యుఫాక్చరింగ్ కార్యకలాపాల విస్తరణ కోసం 9 వేల కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టడానికి ముందుకొచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమైన ఎలీ లిల్లీ ప్రతినిధి బృందం ఆ మేరకు అంగీకారం తెలియజేసింది.



**జయభేరి, హైదరాబాద్ :**

ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ప్రెసిడెంట్ ప్యాట్రిక్ జాన్సన్, సంస్థ ఇండియా ప్రెసిడెంట్ విన్స్‌లో టకర్ తో పాటు ఇతర ప్రతినిధులు ముఖ్యమంత్రితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఉన్నారు. ప్రపంచంలో పేరొందిన ఫార్మా దిగ్గజ కంపెనీ ఎలి లిల్లీ కంపెనీ కార్యకలాపాలను విస్తరించడానికి హైదరాబాద్ కేంద్రంగా కాంట్రాక్ట్ మ్యాన్యుఫాక్చరింగ్ నిర్వహించనున్నట్టు ప్రకటించింది. అందుకోసం ఒక బిలియన్ డాలర్ల (సుమారు రూ. 9000 కోట్లు) భారీ మొత్తాన్ని వెచ్చించనుంది. ముఖ్యమంత్రితో చర్చల అనంతరం ఎలి లిల్లీ కంపెనీ తమ విస్తరణ ప్రణాళికలు, తెలంగాణలో భారీ ఎత్తున కార్యకలాపాలకు సంబంధించి కీలక ప్రకటన చేసింది.

రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో దేశంలో హైదరాబాద్ నుంచి కార్యకలాపాలను విస్తరిస్తున్నట్టు తెలియజేసింది. కాంట్రాక్ట్ మ్యాన్యుఫాక్చరింగ్ ద్వారా సంస్థ కార్యకలాపాలను హైదరాబాద్ నుంచి విస్తరించాలన్న నిర్ణయంపై ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు సంస్థను అభినందించారు. తెలంగాణపై విశ్వాసం ఉంచినందుకు కంపెనీ ప్రతినిధులను ధన్యవాదాలు తెలిపారు. పెట్టుబడులతో వచ్చే కంపెనీలు, పరిశ్రమలకు తమ ప్రభుత్వం అన్ని రకాలుగా మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. హైదరాబాద్ ఇప్పటికే దేశంలోనే ఫార్మా హబ్‌గా ప్రఖ్యాతి గడించిందని, ఇప్పుడు ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తుందన్నారు.

1965లో ఇందిరాగాంధీ ఐడీపీఎల్‌ను హైదరాబాద్‌కు తీసుకురావడంతో ఫార్మా రంగం విస్తరించిందని గుర్తుచేశారు. పేరొందిన దిగ్గజ ఫార్మా కంపెనీలుండటంతో దేశంలో 40 శాతం బల్క్ డ్రగ్స్ హైదరాబాద్‌లోనే ఉత్పత్తి అవుతున్నాయని చెప్పారు. కోవిడ్ వ్యాక్సిన్లను ఇక్కడే తయారు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఫార్మా కంపెనీలను ప్రోత్సహించే ఫార్మా పాలసీని ప్రభుత్వం అనుసరిస్తుందని చెప్పారు. జీనోమ్ వ్యాలీలో ఏటీసీ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని, జీనోమ్ వ్యాలీకి కావాల్సిన సాంకేతిక సహకారం అందిస్తామని చెప్పారు. ఎలి లిల్లీ హైదరాబాద్ నుంచి వాణిజ్య కార్యకలాపాల్లో భాగంగా కాంట్రాక్ట్ మ్యాన్యుఫాక్చరింగ్ ద్వారా రాష్ట్రంతో పాటు దేశంలో ఫార్మా రంగంలో వేలాది మంది ప్రతిభావంతులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయి. వీలైనంత తొందరలోనే కెమిస్టులు, అనలిటికల్ సైంటిస్టులు, క్వాలిటీ కంట్రోల్, మేనేజ్‌మెంట్ నిపుణులు, ఇంజనీర్ల నియామకాలకు అవకాశం ఏర్పడుతుంది. అమెరికాకు చెందిన ఎలి లిల్లీ కంపెనీకి 150 ఏళ్లుగా ప్రపంచ వ్యాపంగా ఔషధాల తయారీ రంగంలో విశేషమైన వైద్య సేవలను అందిస్తుంది. ప్రధానంగా డయాబెటిస్, ఒబెసిటీ, ఆల్జీమర్, క్యాన్సర్, ఇమ్యూన్ వ్యాధులకు సంబంధించిన ఔషధాలు, కొత్త ఆవిష్కరణలపై ఈ కంపెనీ పని చేస్తుంది.

ఇండియాలో ఇప్పటికే గురుగ్రామ్, బెంగుళూరులో ఎలి లిల్లీ కంపెనీ కార్యకలాపాలు కొనసాగిస్తోంది. హైదరాబాద్‌లో ఈ ఏడాది ఆగస్ట్ నెలలో గ్లోబల్ కెపాబులిటీ సెంటర్‌ను ప్రారంభించిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌లో ఎలి లిల్లీ కాంట్రాక్ట్ మాన్యుఫాక్చరింగ్‌తో తెలంగాణలో ప్రతిభావంతులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెరుగుపరుస్తుందని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి సంజయ్ కుమార్, సీఎం స్పెషల్ సెక్రెటరీ అజిత్ రెడ్డి పాల్గొన్నారు.



# బీహార్ లో కింగ్ మేకర్ గా పీకే

**జయభేరి, పాట్నా, అక్టోబరు 6:**

ప్రశాంత్ కిషోర్ పేరుపొందిన రాజకీయ వ్యూహకర్త. మనదేశంలో రాజకీయాలను కూడా కార్పొరేట్ మయం చేసిన వ్యక్తి. పైగా ఎలాంటి రాజకీయాలు చేయాలో.. ఎలాంటి రాజకీయాలు చేస్తే ఓట్లు పడతాయో.. ఒక స్ట్రాటజీ మాదిరిగా అతను చెప్పేవాడు. మనదేశంలో ఉన్న మెజారిటీ రాజకీయ పార్టీలకు అతడు పని చేశాడు. అయితే ఎక్కువసార్లు అతడి ప్రణాళికలు విజయవంతమై.. అతడు పని చేసిన రాజకీయ పార్టీలు అధికారంలోకి వచ్చాయి. ఏపీలో వైసిపి, టిడిపి, కేంద్రంలో బిజెపి, ఒకానొక సందర్భంలో భారత రాష్ట్ర సమితి, టిఎంసి.. ఇలా అనేక రాజకీయ పార్టీలు అతడి ప్రణాళికలను అమలు చేసి అధికారంలోకి వచ్చాయి. ఎవరికో సేవలు చేసి.. అధికారంలోకి తీసుకొచ్చే బదులు.. తనే ఒక రాజకీయ పార్టీని పెట్టాలని ప్రశాంత్ కిషోర్ అనుకున్నాడు. అనుకున్నది తడవుగా జన్ సూరజ్ పేరుతో పార్టీ ని ఏర్పాటు చేశాడు. ప్రస్తుతం ఆ పార్టీ బీహార్ రాష్ట్రంలో పోటీ చేస్తోంది.ఇటీవల ఓ సంస్థ నిర్వహించిన సర్వేలో ప్రశాంత్ కిషోర్ పార్టీ బీహార్ రాష్ట్రంలో జరిగే ఎన్నికల్లో ముఖ్య పాత్ర పోషించే అవకాశం కనిపిస్తోందని తెలిపింది.. అందువల్లే ప్రశాంత్ కిషోర్ వ్యూహాత్మకంగా ప్రచారం చేస్తున్నారు. అధికార పార్టీని.. ప్రతిపక్ష పార్టీని తనదైన వ్యూహాలతో ఇబ్బంది పెడుతున్నారు. గతంలో ఈ పార్టీలతో పనిచేసిన అనుభవం ఉన్న నేపథ్యంలో ప్రశాంత్ కిషోర్ తనదైన చాకచక్యాన్ని ప్రదర్శిస్తున్నారు.. ఏమాత్రం అవకాశం దొరికినా చాలు రెచ్చిపోతున్నారు. తను ఇప్పటికిప్పుడు అధికారంలోకి రాకపోయినా పర్వాలేదు గానీ.. బీహార్ రాష్ట్ర అభివృద్ధిని మాత్రం విస్మరించేది లేదని ప్రశాంత్ కిషోర్ చెప్తున్నారు.. రాజకీయ వ్యూహ కర్తగా పేరుపొందిన ప్రశాంత్ కిషోర్ పలు ఇంటర్వ్యూలలో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా తాను ఎదుర్కొన్న రాజకీయపరమైన విషయాలను మొహమాటం లేకుండా చెబుతున్నారు. 2021 నుంచి ఇప్పటివరకు కన్సల్టెన్సీ సేవల ద్వారా తాను 241 కోట్లు సంపాదించాలని ప్రశాంత్ కిషోర్ పేర్కొన్నారు. వీటిలో 30.95 కోట్లు జీఎస్టీ రూపంలో.. 20 కోట్లు ఐటి రూపంలో చెల్లించినట్టు పేర్కొన్నారు. 98.75 కోట్లను పార్టీకి డొనేషన్ రూపంలో ఇచ్చినట్టు వెల్లడించారు. తన నైపుణ్యాన్ని అనుభవాన్ని ఉపయోగించి రెండు గంటలకు 11 కోట్లు తీసుకున్నట్టు ప్రశాంత్ కిషోర్ పేర్కొన్నారు.. " రాజకీయాలు , వ్యాపారం వేరువేరు కాదు. ఒక వ్యాపారి ముందస్తు లాభాలను గురించి పెట్టుబడి పెడుతుంటాడు. జనాల అవసరాలకు తగ్గట్టుగా నడుచుకుంటాడు. రాజకీయ పార్టీలు కూడా అంతే. జనాల అవసరాల ఆధారంగా హామీలు ఇస్తుంటాయి. అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను అమలు చేయడంలో షరతులు విధిస్తుంటాయి. ఎన్నికల్లో చేసిన ఖర్చుకు మించి సంపాదిస్తుంటాయి. అయితే ఇందులో వ్యూహాత్మకతను పాటించే రాజకీయ పార్టీకి మాత్రమే అధికారం దక్కుతుందని" ప్రశాంత్ కిషోర్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు.



# 45 రోజుల్లో చలాన్ కట్టకపోతే బండి సీజ్

**జయభేరి, హైదరాబాద్:**

మోటారు వెహికిల్స్ రూల్స్1989లో కేంద్రం కీలక సవరణలు ప్రతిపాదించింది. నిబంధనలపై అభ్యంతరాలు, సూచనలు ఉంటే రవాణాశాఖ అదనపు కార్యదర్శికి పంపొచ్చని కేంద్రం పేర్కొంది. ఐదుకు మించి చలాన్లుంటే వాహనదారుడి లైసెన్స్ రద్దు చేసే అవకాశం వుంది. 45 రోజుల్లో ప్రస్తుతం 90 రోజులు, చలాన్ కట్టకపోతే వాహనం సీజ్ చేయవచయచారు. చలాన్లు ఆలస్యం చేస్తే ఆ వాహనంపై లావాదేవీలు జరపకుండా నిబంధన విధిస్తారు. రూల్స్ అతిక్రమిస్తే 3 రోజుల్లో నోటీసులు జారీ చేయనున్నారు.

# మెట్రోకు పోటెత్తిన ప్రయాణికులు

**జయభేరి, హైదరాబాద్:**

ఎల్బీనగర్ ఏరియాలో భారీగా ట్రాఫిక్ జాం అయింది. దాంతో ప్రయాణికులు మెట్రో రైల్ ను నమ్ముకున్నారు. ఒక్కసారిగా ప్రయాణికులు పోటెత్తడంతో వారిని మెట్రో సిబ్బంది క్యూ పద్ధతిలో పంపించారు. కిలోమీటర్ మేర ప్రయాణికులు లైన్ కట్టిన పరిస్థితి నెలకొంది. ప్రయాణికులు తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు, లైన్లో ప్లాట్ఫారం కు చేరడానికి రెండు గంటల సమయం పడుతోంది.

# అంబులెన్స్ కు దారేది

**జయభేరి, హైదరాబాద్:**

హైదరాబాద్ టూ విజయవాడ నేషనల్ హైవేపై వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఆదివారం నిన్న మధ్యాహ్నం నుంచి హైవేపై రికార్డు స్థాయిలో వాహనాల రద్దీ పెరిగింది. పంతంగి,కొర్లపహాడ్ టోల్ గేట్ల వద్ద ట్రాఫిక్ జామ్ ఏర్పడ్డాయి. పంతంగి టోల్ గేట్ వద్ద ట్రాఫిక్ లో రెండు అంబులెన్స్ లు ఇరుక్కున్నాయి. అరగంట సేపటి దాకా టోల్ ప్లాజా సిబ్బంది చూపించలేదు. అంబులెన్స్ లు,వీఐపీ ల వాహనాలకు ఉపయోగించే ఫ్రీ కౌంటర్ క్లోజ్ చేసారు. ప్లాజా సిబ్బంది నిర్లక్ష్యం తో ట్రాఫిక్ చిక్కుల్లో అంబులెన్స్ లు పడ్డాయి.

# రేపాకపల్లి గ్రామంలో గండ్ర జ్యోతి పర్యటన

**జయభేరి, రెగోండ:**

వరంగల్ జిల్లా జడ్పీ మాజీ చైర్పర్సన్ & భూపాలపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి రేపాక, రేపాకపల్లి గ్రామంలో పర్యటించారు. రేగొండ మండలం రేపాక, రేపాకపల్లి గ్రామంలో విస్తృతంగా పర్యటించి 22 నెలల కాలంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేయడంలో విఫలం అయిందని ఏద్దేవా చేస్తూ ఇంటింటికి తిరిగి ప్రజలకు అర్థం అయ్యేలా చెప్పారు. కాంగ్రెస్ బాకీ కార్డు ని వివరిస్తూ రానున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి చెంప చెల్లుమనేలా ప్రజల పక్షాన పోరాటం చేస్తున్న బిఆర్ఎస్ పార్టీ మద్దతు తెలపాలని కోరుతూ గండ్ర జ్యోతి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రేగొండ మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వైద్యశాస్త్రంలో ముగ్గురికి నోబెల్

**జయభేరి, న్యూఢిల్లీ, అక్టోబరు 6:**




వైద్య శాస్త్రంలో చేసిన విశేష కృషికిగాను ప్రముఖ శాస్త్రవేత్తలు.. మేరీ ఇ.బ్రున్‌కో, ఫ్రెడ్ రామ్‌స్‌డెల్, షిమన్ సకాగుచీకి ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మక నోబెల్ పురస్కారం అంచించనున్నట్లు పేర్కొంది. వైద్య విభాగంతో మొదలైన నోబెల్ పురస్కారాల ప్రదానం ఈ నెల 13 వరకు కొనసాగనుంది. పలు రంగాల్లో విశేష కృషి చేసిన వారికి ఈ ప్రతిష్టాత్మక అవార్డులను ప్రదానం చేయనున్నారు..కాగా.. రోగనిరోధక వ్యవస్థను ఎలా అదుపులో ఉంచుతారనే దానిపై పరిశోధన చేసినందుకు అమెరికాకు చెందిన మేరీ ఇ బ్రంకో, ఫ్రెడ్ రామ్‌స్‌డెల్, జపాన్‌కు చెందిన షిమోన్ సకాగుచి సోమవారం వైద్యశాస్త్రంలో నోబెల్ బహుమతిని గెలుచుకున్నారని నోబెల్ జ్యూరీ తెలిపింది."పరిధీయ రోగనిరోధక సహానానికి సంబంధించిన వారి ఆవిష్కరణలకు" ఈ ముగ్గురినీ సత్కరించినట్లు నోబెల్ జ్యూరీ పేర్కొంది. "వారి ఆవిష్కరణలు కొత్త పరిశోధనా రంగానికి పునాది వేశాయి.. క్యాన్సర్, ఆటో ఇమ్యూన్ వ్యాధుల వంటి కొత్త చికిత్సల అభివృద్ధికి దోహదపడ్డాయి" అని వెల్లడించింది.ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలను పట్టిపీడిస్తున్న ఆటోఇమ్యూన్ అంటే స్వీయ రోగనిరోధక వ్యాధుల మూల కారణాన్ని, వాటి నివారణకు సంబంధించిన అత్యంత కీలకమైన రహస్యాన్ని ఛేదించిన ముగ్గురు శాస్త్రవేత్తలకు స్వీడన్‌లోని కరోలిన్స్కా ఇన్‌స్టిట్యూట్‌లోని అసెంబ్లీ 2025 సంవత్సరపు వైద్య శాస్త్రంలో నోబెల్ బహుమతి దక్కింది. ఈ ఏడాది వైద్య నోబెల్ బహుమతిని అమెరికాకు చెందిన డాక్టర్ మేరీ ఇ.బ్రంకో, డాక్టర్ ఫ్రెడ్ రామ్‌స్‌డెల్, జపాన్‌కు చెందిన డాక్టర్ షిమోన్ సకాగుచి సంయుక్తంగా అందుకోనున్నారు.వారి 'పెరిఫెరల్ ఇమ్యూన్ టాలరెన్స్' పై చేసిన విప్లవాత్మక ఆవిష్కరణలకుగాను ఈ గౌరవం దక్కింది. ఈ పరిశోధనలు శరీరంలోని రోగనిరోధక వ్యవస్థ తన సొంత కణజాలంపై పొరపాటున దాడి చేయకుండా ఆపడానికి ఉపయోగించే అంతర్గత మెకానిజాన్ని ప్రపంచానికి వివరించాయి.నోబెల్ కమిటీ చైర్మన్ ఒల్లే కాంప్‌పే, ఈ ఆవిష్కరణల ప్రాముఖ్యతను ఉటంకిస్తూ, "వారి పరిశోధనలు రోగనిరోధక వ్యవస్థ ఎలా పనిచేస్తుందో, డయాబెటిస్, మల్టిపుల్ స్క్లెరోసిస్ వంటి తీవ్రమైన ఆటోఇమ్యూన్ రోగాలు ఎందుకు వస్తున్నాయో అర్థం చేసుకోవడానికి ఉపయోగపడతాయి" అని పేర్కొన్నారు. ఈ అవార్డు ప్రకటన వైద్య శాస్త్రంలో, ముఖ్యంగా ఇమ్యునాలజీ (రోగనిరోధక శాస్త్రం) రంగంలో సరికొత్త చికిత్సల అభివృద్ధికి, క్యాన్సర్, అవయవ మార్పిడి రంగాల్లో సరికొత్త పరిశోధనలకు దారితీసింది.

**'సెక్యూరిటీ గార్డ్‌లు' లేకుండా విధ్వంసమే: సకాగుచి తొలి అడుగు**

మన శరీరంలో రోగనిరోధక వ్యవస్థ అనేది నిత్యం అప్రమత్తంగా ఉండే ఒక సైన్యం వంటిది. ఇది బయటి నుంచి వచ్చే వైరస్‌లు, బ్యాక్టీరియాలను గుర్తించి వాటిని నిర్మూలిస్తుంది. ఈ సైన్యంలో అత్యంత కీలకం టిసెల్స్. టిసెల్ రిసెప్టర్లు 'సెన్సార్ల'లా పనిచేసి, శత్రువులను గుర్తిస్తాయి.కానీ ఈ వ్యవస్థలో కమ్యూనికేషన్ లోపం వల్ల టిసెల్స్ పొరపాటున శరీరంలోని ముఖ్యమైన కణజాలాలను (ఉదాహరణకు, ఇన్సులిన్ ఉత్పత్తి చేసే కణాలను లేదా కీళ్ల కణాలను) శత్రువులుగా భావించి దాడి చేస్తాయి. ఫలితంగా టైప్ 1 డయాబెటిస్, మల్టిపుల్ స్క్లెరోసిస్, రుమటాయిడ్ ఆర్థ్రైటిస్ వంటి ఆటోఇమ్యూన్ రోగాలు సంభవిస్తాయి. ఈ విధ్వంసాన్ని అరికట్టే 'బ్రేకింగ్ మెకానిజం'ను కనుగొన్న మొదటి వ్యక్తి డాక్టర్ షిమోన్ సకాగుచి.

సకాగుచి (జపాన్): 1951లో జన్మించిన షిమోన్ సకాగుచి, క్యోటో యూనివర్సిటీ నుంచి 1976లో M.D., 1983లో Ph.D. పట్ పొందారు. ప్రస్తుతం ఆయన ఒసాకా యూనివర్సిటీలోని ఇమ్యూనాలజీ ఫ్రంటియర్ రీసెర్చ్ సెంటర్‌లో డిస్టింగ్విష్డ్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.సకాగుచి 1995లోనే అత్యంత కీలకమైన ఆవిష్కరణ చేశారు: రెగ్యులేటరీ టిసెల్స్. ఇవి రోగనిరోధక వ్యవస్థలో 'సెక్యూరిటీ గార్డ్‌లు' లేదా శాంతిభద్రతల దళాలుగా పని చేస్తాయి. ఇవి CD4, CD25 అనే ప్రోటీన్‌ల ద్వారా గుర్తిస్తారు. ఈ Tregs శరీరంలోని ఆరోగ్యకరమైన కణాలపై దాడి చేయాలనుకునే హానికరమైన టిసెల్‌స్‌ను అణచివేసి, కణజాలాన్ని రక్షిస్తాయి. ఆ రోజుల్లో అనేక మంది శాస్త్రవేత్తలు ఈ ఆవిష్కరణపై మొదట్లో సందేహం వ్యక్తం చేసినప్పటికీ, ఇది ఇమ్యునాలజీలో విప్లవాత్మక ఆవిష్కరణగా నిరూపితమైంది. 2003లో, Tregs అభివృద్ధికి FOXP3 అనే జీన్ అత్యంత కీలకమైనదని సకాగుచి బృందం నిరూపించింది.

**బ్రంకో, రామ్‌స్‌డెల్ పాత్ర**

సకాగుచి పునాది వేసిన Tregs పరిశోధనను, అమెరికన్ శాస్త్రవేత్తలు మేరీ బ్రంకోవ్& ఫ్రెడ్ రామ్‌స్‌డెల్ జన్యుపరమైన కోణంలో ధ్రువీకరించారు. వీరిద్దరూ కలిసి 2001లో రెండో ముఖ్యమైన ఆవిష్కరణ చేశారు.ఫ్రెడ్ రామ్‌స్‌డెల్: 1960లో ఇల్లినాయిస్‌లో జన్మించిన రామ్‌స్‌డెల్, 1987లో UCLA నుంచి ఇమ్యూనాలజీలో Ph.D. పొందారు. ప్రస్తుతం ఆయన శాన్ ఫ్రాన్సిస్కోలోని సోనోమా బయోథెరప్యూటిక్స్‌కు సైంటిఫిక్ అడ్వైజర్‌గా ఉన్నారు. మేరీ ఇ.బ్రంకోవ్: 1961లో జన్మించిన బ్రంకోవ్, ప్రిన్‌స్టన్ యూనివర్సిటీ నుంచి Ph.D. పూర్తి చేశారు. ప్రస్తుతం ఆమె అమెరికాలోని సీటెల్‌లో ఇన్‌స్టిట్యూట్ ఫర్ సిస్టమ్స్ బయాలజీలో సీనియర్ ప్రోగ్రామ్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు.వీరు ఇద్దరూ కలిసి 'స్కర్ఫీ మౌస్' అనే ప్రత్యేక ఎలుక జాతిపై అధ్యయనం చేశారు. ఈ ఎలుకలు తీవ్రమైన ఆటోఇమ్యూన్ రోగాలతో బాధపడుతుంటాయి.వారి పరిశోధనలో, ఎక్స్‌క్రోమాజోమ్‌పై ఉన్న FOXP3 జీన్‌లో మ్యూటేషన్ జరగడమే ఈ రోగాలకు కారణమని తేలింది. ఈ మ్యూటేషన్ Tregs లోపించడానికి దారితీస్తుంది, దీని ఫలితంగా రోగనిరోధక వ్యవస్థ నియంత్రణ కోల్పోయి శరీర కణాలపై దాడి చేస్తుంది.మానవులలో, FOXP3 జీన్‌లో లోపం ఏర్పడినప్పుడు IPEX సిండ్రోమ్ (ఇమ్యూన్ డిస్‌రెగ్యులేషన్, పాలీఎండోక్రినోపతీ, ఎంటరోపతీ, ఎక్స్‌లింక్డ్) అనే అరుదైన, ప్రాణాంతకమైన ఆటోఇమ్యూన్ వ్యాధి వస్తుంది. బ్రంకోవ్, రామ్‌స్‌డెల్ ఈ జన్యు మూలాన్ని స్పష్టంగా నిరూపించడం ద్వారా, ఇమ్యునాలజీలో కొత్త రంగాన్ని ఆవిష్కరించారు.

**చికిత్సలో విప్లవం**

ఈ ముగ్గురు శాస్త్రవేత్తల ఆవిష్కరణలు కేవలం రోగాల కారణాలను వివరించడానికే పరిమితం కాలేదు, నేడు ఆధునిక వైద్యంలో చికిత్సా విధానాలను సమూలంగా మారుస్తున్నాయి.

**1. క్యాన్సర్ ఇమ్యునోథెరపీలో కీలకం**

రోగనిరోధక వ్యవస్థ నియంత్రణను Tregs నిర్వహిస్తాయి. దురదృష్టవశాత్తు, క్యాన్సర్ కణాలు చాలా తెలివిగా పనిచేస్తాయి. అవి ఈ Tregsను తమ వైపు ఆకర్షించుకుంటాయి. ఫలితంగా, క్యాన్సర్ కణాల చుట్టూ ఒక బలమైన 'రక్షణ గోడ' ఏర్పడుతుంది. ఈ గోడ కారణంగా, రోగనిరోధక వ్యవస్థ క్యాన్సర్ కణాలను గుర్తించి దాడి చేయలేదు.ఈ నోబెల్ విజేతల పరిశోధనల ఆధారంగా, క్యాన్సర్ ఇమ్యునోథెరపీల ప్రధాన లక్ష్యం ఏమిటంటే, ఈ Tregs రక్షణ గోడను కూల్చివేయడం. ఈ అవగాహన ద్వారా అభివృద్ధి చేసిన CAR Tసెల్ థెరపీ వంటి అత్యాధునిక చికిత్సలు ల్యుకేమియా, లింఫోమా వంటి క్యాన్సర్ల చికిత్సలో గొప్ప విజయాలు సాధిస్తున్నాయి.

**2. ఆటోఇమ్యూన్ రోగాలకు టార్గెటెడ్ ట్రీట్‌మెంట్**

Tregs సంఖ్య లేదా పనితీరు లోపించిన కారణంగా వచ్చే ఆటోఇమ్యూన్ వ్యాధులకు చికిత్స అందించడానికి శాస్త్రవేత్తలు ఇప్పుడు నిర్దిష్ట పద్ధతులను ఉపయోగిస్తున్నారు. ఉదాహరణకు, ఇంటర్‌ల్యుకిన్2 వంటి రసాయన పదార్థాలను ఉపయోగించి రోగుల శరీరంలో Tregs సంఖ్యను పెంచే ప్రయత్నాలు ప్రస్తుతం వైద్య ట్రయల్‌స్‌లో ఉన్నాయి. ఈ పద్ధతి IPEX సిండ్రోమ్ వంటి అరుదైన, తీవ్రమైన రోగాలకు కూడా మంచి ఫలితాలను ఇస్తోంది.

**3. అవయవ మార్పిడి లో అద్భుతం**

అవయవ మార్పిడి శస్త్రచికిత్సల్లో రోగి శరీరం కొత్త అవయవాన్ని 'తిరస్కరించడం' ఒక పెద్ద సమస్య. దీనిని నివారించడానికి దీర్ఘకాలికంగా ఇమ్యూనో సప్రెసివ్ మందులు వాడాల్సి ఉంటుంది.అయితే, ఈ పరిశోధనల ఫలితంగా, శాస్త్రవేత్తలు ఇప్పుడు Tregsను ప్రత్యేకమైన 'అడ్రెస్ లేబుల్స్'తో ట్యాగ్ చేసి, మార్పిడి చేసిన అవయవం వద్దకు నేరుగా పంపించగలుగుతున్నారు. ఈ ప్రత్యేకమైన Tregs, ఆ అవయవాన్ని తిరస్కరించకుండా రోగనిరోధక వ్యవస్థను నియంత్రిస్తాయి, తద్వారా అవయవ తిరస్కరణను సమర్థవంతంగా నిరోధిస్తాయి.

దీర్ఘకాలిక మందుల అవసరాన్ని తగ్గిస్తాయి. స్టెమ్ సెల్ ట్రాన్స్‌ప్లాంట్లలో తలెత్తే సమస్యలను తగ్గించడానికి కూడా Tregs పరిశోధన దోహదపడుతుంది.

నోబెల్ బహుమతులు భౌతిక శాస్త్రంలో, రసాయన శాస్త్రంలో, సాహిత్యంలో, వైద్యశాస్త్రం అలాగే ఆర్థిక శాస్త్రం కృషి చేసిన శాస్త్రవేత్తలకు, ప్రపంచ శాంతికి కృషిచేసిన సామాజికవేత్తలకు ప్రతియేటా బహూకరిస్తుంటారు. ఈ ఐదు బహుమతులు వ్యాపారవేత్త, ప్రఖ్యాత స్వీడిష్ శాస్త్రవేత్త ఆల్ఫ్రెడ్ నోబెల్ 1895 నాటి వీలునామా ప్రకారం 1901లో ప్రారంభించబడ్డాయి. విజేతలను వివిధ సంస్థల నుంచి ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీలు ఎంపిక చేస్తాయి. మిగతా పురస్కారాలను త్వరలో ప్రకటించనున్నారు.


# రాహుల్ ఆరు రోజులు.. కొలంబియా టూర్...

- ఏం చేస్తున్నారు... మిలియన్ డాలర్ల ప్రశ్న



**జయభేరి, న్యూఢిల్లీ, అక్టోబరు 6:**

కాంగ్రెస్ పార్టీ అగ్రనేత.. మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ముని మనుమడు.. దివంగత ప్రధాని ఇందిరాగాంధీ మనుమడు.. రాహుల్ గాంధీ. ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత. చాలాకాలంగా రాహుల్‌గాంధీ విదేశీ పర్యటనలు గోప్యంగా ఉంచుతున్నారు. భారత వ్యతిరేక శక్తులతో విదేశాల్లో సమావేశం అవుతున్నారు. తాజాగా రాహల్ ఆరు రోజులుగా విదేశంలో ఉంటున్నారు. ఆయన కార్యకలాపాలపై స్పష్టత లేకపోవడం రాజకీయ వర్గాల్లో ఆసక్తి కలిగిస్తోంది. కొలంబియాలోని ఒక విశ్వవిద్యాలయంలో విద్యార్థులతో జరిగిన చర్చ వీడియో మాత్రమే బయటకు రావడంతో, మిగతా అంశాలు గోప్యంగానే ఉన్నాయి. రాహుల్‌గాంధీ ఎవరిని కలుస్తున్నారో, ఎక్కడికి వెళ్లుతున్నారో, ఏ అంశాలపై చర్చ జరిపారో కాంగ్రెస్ అధికారికంగా వెల్లడించలేదు. యూనివర్సిటీలో ఆయన పాల్గొన్న కార్యక్రమానికి సంబంధించిన వీడియో కూడా స్పష్టంగా రికార్డ్ కాలేదు. ఈ మౌనం రాజకీయంగా అనుమానాలను కలిగిస్తోంది. కాంగ్రెస్ పార్టీనే ఈ పర్యటన వివరాలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత వహించాలి. సాధారణంగా ఇండియాలో టీషర్ట్ తో కనిపించే రాహుల్‌గాంధీ, కొలంబియాలో మాత్రం సంప్రదాయ భారతీయ దుస్తులు ధరించడంతో చర్చనీయాంశమయ్యారు. ఇది విదేశాల్లో భారతీయ విలువలను ప్రతిబింబించాలనే సంకేతమా లేదా ప్రజలలో కొత్త ఇమేజ్ సృష్టించాలనే ప్రయత్నమా అన్నది అన్వేషణకు గురవుతోంది.రాహుల్ గతంలో కూడా యురోపియన్ యూనియన్, అమెరికా పర్యటనల్లో భారత అంతర్గత అంశాలను ప్రస్తావించారు. కొన్ని సందర్భాల్లో ఆయన వ్యాఖ్యలు విదేశాలలో భారత ప్రభుత్వంపై ప్రతికూల ప్రతిఫలాలను మిగిల్చినట్లు విమర్శకులు పేర్కొన్నారు. ఈసారి కూడా ఆయన కలుసుకుంటున్న వ్యక్తులు, చర్చల అంశాలు ఏవో తెలియకపోవడం రాజకీయ వర్గాల్లో సందేహాలను పెంచుతోంది.భారత్‌లో గట్టి విమర్శల మధ్య విదేశీ పర్యటన చేయడం రాహుల్ రాజకీయ వ్యూహంలో భాగమేమో అన్న ప్రశ్న ముందుకొస్తోంది. బంగ్లాదేశ్, శ్రీలంక వంటి పొరుగు దేశాల్లో జరుగుతున్న రాజకీయ పరిణామాలతో భారత అంతర్గత రాజకీయాలను పోల్చడం కొందరికి కలవరాన్ని కలిగిస్తోంది. ప్రస్తుతం ఆయన పర్యటన వ్యక్తిగతమా, లేక రాజకీయంగానా అన్నది స్పష్టత లేదు ప్రజలు, మీడియాలోని అనేక వర్గాలు రాహుల్ పర్యటన వెనుక ఉన్న ఉద్దేశాన్ని తెలుసుకోవాలనుకుంటున్నాయి. ఆయన కార్యకలాపాలు, కలిసి మాట్లాడిన వ్యక్తుల వివరాలు వెల్లడిస్తే మాత్రమే అనుమానాలు నివారించబడతాయి. నాలుగు దేశాల పర్యటనకు వెళ్లి.. ఒకే దేశంలో ఆరు రోజులు ఉండడం అనుమానాలకు తావిస్తోంది.



# 'మాస్ జాతర' నుంచి క్లాస్ సాంగ్..

## శ్రీలీల కోసం రవితేజ పాడిన బ్యూటిఫుల్ మెలోడీ విన్నారా?

మాస్ మహారాజా రవితేజ, శ్రీలీల హీరోహీరోయిన్లుగా నటిస్తున్న తాజా చిత్రం 'మాస్ జాతర'. 'ధమాకా' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత వీరిద్దరి కలయికలో రాబోతున్న ఈ సినిమాని కొత్త దర్శకుడు భాను భోగవరపు తెరకెక్కిస్తున్నారు. అక్టోబర్ 31న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రమోషన్స్ లో భాగంగా 'హుడియో హుడియో' అనే సాంగ్ లిరికల్ వీడియోని అక్టోబర్ 8న రిలీజ్ చేయనున్నారు. తాజాగా దీని ప్రోమోని సోషల్ మీడియాలో విడుదల చేశారు. ''నా గుండె గాలి పటమల్లే ఎగరేశావే.. నీ సుట్టు పక్కల తిరిగేలా గిరిగీసావే..'' అంటూ సాగిన ఈ మెలోడీ సాంగ్ ఆకట్టుకుంటోంది. దీనికి బ్యూటిఫుల్ ట్యూన్ కంపోజ్ చేసిన భీమ్స్ సిసిరోలియో.. మలయాళ మ్యూజిక్ డైరెక్టర్ హేషమ్ అబ్దుల్ వహాబ్ తో కలిసి పాడారు. దేవ్ ఈ పాటకు లిరిక్స్ రాశారు.

# నిశ్శబ్దంగా మొదలుపెట్టేశారా?



ఎట్టకేలకు వందవ సినిమా మైలురాయికి చేరుకున్నారు అగ్ర హీరో అక్కినేని నాగార్జున. ఒక స్టార్ హీరో వంద సినిమాలు పూర్తి చేయడం అనేది సాధారణమైన విషయం కాదు. అదో బిగ్ ఎఛీవ్‌మెంట్. ఈ తరం హీరోలకైతే ఆ ఘనత అందని ద్రాక్షపండే. తన వందవ సినిమాను రా.కార్తీక్ దర్శకత్వం వహిస్తారని ఇటీవల ఓ సందర్భంలో నాగ్ స్వయంగానే చెప్పారు.

ఎట్టకేలకు వందవ సినిమా మైలురాయికి చేరుకున్నారు అగ్ర హీరో అక్కినేని నాగార్జున. ఒక స్టార్ హీరో వంద సినిమాలు పూర్తి చేయడం అనేది సాధారణమైన విషయం కాదు. అదో బిగ్ ఎఛీవ్‌మెంట్. ఈ తరం హీరోలకైతే ఆ ఘనత అందని ద్రాక్షపండే. తన వందవ సినిమాను రా.కార్తీక్ దర్శకత్వం వహిస్తారని ఇటీవల ఓ సందర్భంలో నాగ్ స్వయంగానే చెప్పారు. ఆ సినిమాకు 'కింగ్ 100 నాట్ అవుట్' అనే టైటిల్ కూడా ప్రచారంలో ఉంది. ఇప్పుడు ఈ టైటిల్‌తోపాటు మరో కొత్త టైటిల్ కూడా ఫిల్మ్‌వర్గాల్లో వినిపిస్తుంది.

# పవన్ కళ్యాణ్‌తో డేటింగ్ చేస్తా..!



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ప్రస్తుతం సినిమాలతో పాటు రాజకీయాల్లోనూ బిజీగా ఉన్నరు. డిప్యూటీ సీఎంగా పవన్ కళ్యాణ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్న విషయం తెలిసిందే.. ఇక పవన్ సినిమాల విషయాని కొస్తే ఇప్పటికే రెండు సినిమాలను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. మొన్నామధ్య హరిహరవీరుమల్లు అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు పవన్. ఈ సినిమా మిక్స్డ్ టాక్ సొంతం చేసుకుంది. ఆ తర్వాత రీసెంట్ గా ఓజీ సినిమాతో మరోసారి థియేటర్స్ దగ్గర సందడి చేశారు పవన్. యాక్షన్ ఎంటర్టైనర్ గా తెరకెక్కిన ఓజీ సినిమా బ్లాక్ బస్టర్ గా నిలిచింది. ఇదిలా ఉంటే తాజాగా ఓ ముద్దుగుమ్మ పవన్ కళ్యాణ్ తో డేటింగ్ చేస్తా.. అని చెప్పి షాక్ ఇచ్చింది. పవన్ కళ్యాణ్ తో డేటింగ్ చేస్తానన్నా ఆ బ్యూటీ ఎవరో తెలుసా..? తన అందంతో ప్రేక్షకులను విశేషంగా కవ్వించిన బ్యూటీస్ లో ఫరియా అబ్దుల్లా ఒకరు.. నవీన్ పోలిశెట్టి హీరోగా నటించిన జాతిరత్నాలు సినిమాతో ఓవర్ నైట్ లో క్రేజ్ తెచ్చుకుంది ఈ అందాల భామ. తొలి సినిమాతోనే మంచి విజయాన్ని అందుకున్న ఫరియా అబ్దుల్లా ఆతర్వాత వరుసగా సినిమాలు చేసింది. కానీ ఈ ముద్దుగుమ్మకు ఆ రేంజ్ హిట్స్ మాత్రం రావడం లేదు.. ఈ క్రమంలోనే మొన్నీమధ్య ఫరియా అబ్దుల్లా ఓ డాన్స్ షోకు జడ్జ్ గా వ్యవహరించింది. అలాగే సుమతో ఓ ఇంటర్వ్యూలో పాల్గొంది ఫరియా అబ్దుల్లా. ఈ చిట్ చాట్ లో ఫరియా అబ్దుల్లా మాట్లాడుతూ.. ఆసక్తికర కామెంట్స్ చేసింది. నీకు ఛాన్స్ వస్తే ఎవరితో డేట్ చేస్తావ్.? ఎవరిని పెళ్లి చేసుకుంటావ్.? అని సుమ అడిగితే.. ఊహించని సమాధానం చెప్పింది ఈ ముద్దుగుమ్మ. నాకు ఛాన్స్ వస్తే పవన్ కళ్యాణ్ తో డేటింగ్ చేస్తా.. ప్రభాస్ ను పెళ్లి చేసుకుంటా.. అని చెప్పుకొచ్చింది ఈ చిన్నది. ఈ కామెంట్స్ ఇప్పుడు వైరల్ గా మారాయి. ఈ కామెంట్స్ పై పవన్, ప్రభాస్ అభిమానులు రకరకాలుగా స్పందిస్తున్నారు. కాగా సోషల్ మీడియాలో ఫరియా అబ్దుల్లా గ్లామర్ గేట్లు ఎత్తేసి ఓ రేంజ్ లో కుర్రాళ్లను కవ్విస్తుంది.

# పిచ్చెక్కిస్తున్న సొగసరి..!



ఇస్మార్ట్ బ్యూటీ నిధి అగర్వాల్ ఇటీవలే 'హరి హర వీరమల్లు' సినిమాతో తెలుగు ప్రేక్షకులను పలకరించింది. పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన ఈ చిత్రంలో పంచమి అనే పాత్రలో నటిచింది. ఎన్నో ఆశలు పెట్టుకున్న ఈ సినిమా.. బాక్సాఫీస్ దగ్గర బోల్తా కొట్టింది. దాన్నుంచి వీలైనంత త్వరగా బయటకు వచ్చిన నిధి.. ఎప్పటిలాగే సోషల్ మీడియాలో తన ట్రెండీ ఫొటోలతో సందడి చేస్తోంది. లేటెస్టుగా ఫ్లడ్ లైట్ల వెలుగులో రెడ్ డ్రెస్సులో మెరిసిపోతున్న కొన్ని పిక్స్ షేర్ చేసింది. అందాల భామ నిధి అగర్వాల్ తన గ్లామర్, స్టైల్‌తో టాలీవుడ్‌లో మంచి గుర్తింపు తెచ్చుకుంది. 'సవ్యసాచి' సినిమాతో తెలుగులో ఎంట్రీ ఇచ్చిన ఈ బ్యూటీ.. 'మిస్టర్ మజ్ను', 'ఇస్మార్ట్ శంకర్' వంటి చిత్రాలతో ప్రేక్షకులకు చేరువైంది. చివరగా 'హరి హర వీరమల్లు' చిత్రంలో పంచమిగా అలరించింది. ప్రస్తుతం ప్రభాస్ సరసన 'ది రాజాసాబ్' సినిమాలో హీరోయిన్ గా నటిస్తోంది. సోషల్ మీడియాలో యాక్టీవ్ గా ఉండే నిధి.. తాజాగా తన ఇన్స్టాగ్రామ్ లో పోస్ట్ చేసిన కొన్ని ఫోటోలు నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. రెడ్ కలర్ స్ట్రాప్‌లెస్ గౌనులో మెరిసిపోతున్న ఆమె అందాలు ఇంటర్నెట్‌లో సెగలు పుట్టిస్తున్నాయి. ఫ్లడ్ లైట్ల వెలుగులో నిధి అగర్వాల్ ఇచ్చిన గ్లామర్ పోజులు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి.

# ఓజీ ప్రభంజనం..
# రూ.300 కోట్ల క్లబ్‌లో పవన్ కళ్యాణ్..



పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన 'ఓజీ' సినిమా బాక్సాఫీస్ దగ్గర భారీ వసూళ్లను రాబట్టింది. సుజీత్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ గ్యాంగ్ స్టర్ యాక్షన్ డ్రామా.. సెప్టెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. తొలి రోజే రికార్డ్ బ్రేకింగ్ ఓపెనింగ్స్ రాబట్టింది. 4 రోజుల్లోనే రూ.200 కోట్ల క్లబ్‌లోకి చేరినట్లు మేకర్స్ ప్రకటించారు. తాజాగా రూ.300 కోట్ల క్లబ్‌లో ఎంటర్ అయినట్లుగా అధికారికంగా వెల్లడించారు.

'ఓజీ' 2025లో అత్యధిక వసూళ్లు రాబట్టిన సినిమాగా నిలిచిందని చిత్ర బృందం ఆదివారం సాయంత్రం ప్రకటించింది. అయితే కలెక్షన్ పోస్టర్ రిలీజ్ చేయకపోవడంతో, ఎంత గ్రాస్ వచ్చిందనేది క్లారిటీ రాలేదు. అయితే సోమవారం వసూళ్ల వివరాలను తెలుపుతూ పోస్టర్ రిలీజ్ చేశారు. 11 రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా 308 కోట్లకు పైగా గ్రాస్ రాబట్టినట్లు పేర్కొన్నారు . వెంకటేష్ నటించిన 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా బాక్సాఫీస్ దగ్గర రూ.303 కోట్ల కలెక్షన్స్ అందుకుంది. నిన్నటి వరకూ హయ్యెస్ట్ గ్రాస్ రాబట్టిన తెలుగు సినిమా ఇదే. కానీ ఇప్పుడు రూ.308 కోట్లకు పైగా వసూళ్లతో ఓజీ ఆ రికార్డును బ్రేక్ చేసి, టాప్ లో నిలిచింది. ఇది పవన్ కళ్యాణ్ కెరీర్ లో బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్. కాకపోతే సినిమాకి ఉన్న హైప్, అధిక టికెట్ రేట్లతో కంపేర్ చేసి చూస్తే మాత్రం.. కలెక్షన్స్ తక్కువనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. 'కాంతార చాప్టర్ 1' 4 రోజుల్లోనే రూ.300 కోట్ల క్లబ్ లో చేరితే.. ఓజీకి 11 రోజులు పట్టిందని కామెంట్స్ చేస్తున్నారు.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314**. email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**